RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers



హైదరాబాద్ 18 జూలై 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:43


### ఆధునిక హంగులతో ముస్తాబైన మంగళగిరి రైల్వే స్టేషన్...

# వర్చువల్ గా ప్రారంభించిన ప్రధాని మోదీ




ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో ఉన్న చారిత్రక మంగళగిరి పట్టణానికి రైల్వే పరంగా కొత్త శోభ వచ్చింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'అమృత్ భారత్ స్టేషన్ పథకం' కింద రూ.12.56 కోట్ల వ్యయంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన మంగళగిరి రైల్వే స్టేషన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. గుంటూరు డివిజన్ పరిధిలోని ఈ స్టేషన్‌లో ప్రయాణికులకు ప్రపంచస్థాయి అనుభూతిని అందించడమే లక్ష్యంగా అనేక అభివృద్ధి పనులు చేపట్టారు.

ఆధునికీకరణలో భాగంగా స్టేషన్ ముఖద్వారాన్ని ఆకర్షణీయంగా మార్చడంతో పాటు, ప్రయాణికుల కోసం మెరుగైన వెయిటింగ్ హాల్స్ నిర్మించారు. ప్రయాణికులకు సులభంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా యాక్సెసిబిలిటీ ఫీచర్లను మెరుగుపరిచారు. ముఖ్యంగా, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణించేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేయడం గమనార్హం. ఈ ఆధునిక సౌకర్యాలు ప్రయాణ అనుభవాన్ని మరింత సౌకర్యవంతంగా, సురక్షితంగా మారుస్తాయని అధికారులు తెలిపారు. దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని, సమగ్ర సౌకర్యాలతో ఈ స్టేషన్‌ను తీర్చిదిద్దారు.

ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా రైలు, రోడ్డు కనెక్టివిటీని బలోపేతం చేసే బృహత్తర ప్రణాళికలో భాగం. ప్రధాని మోదీ ఒకే రోజు రూ.5,470 కోట్లకు పైగా విలువైన పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు, మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా, రూ.1,570 కోట్ల వ్యయంతో ఆధునీకరించిన 75 రైల్వే స్టేషన్లను జాతికి అంకితం చేశారు. 'వారసత్వం, అభివృద్ధి' (విరాసత్ భీ, వికాస్ భీ) స్ఫూర్తితో స్థానిక సంస్కృతి, చారిత్రక నేపథ్యం ఉట్టిపడేలా ఈ స్టేషన్లను తీర్చిదిద్దారు. మంగళగిరి స్టేషన్‌తో పాటు, పంజాబ్‌లోని జలంధర్ కంటోన్మెంట్ వంటి అనేక స్టేషన్లు ఈ జాబితాలో ఉన్నాయి.

రైల్వే ప్రాజెక్టులతో పాటు పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ మధ్య కనెక్టివిటీని పెంచేందుకు రూ.830 కోట్లతో నిర్మించిన దౌలత్‌పూర్ చౌక్–కటోలి కొత్త రైలు మార్గాన్ని కూడా ప్రధాని ప్రారంభించారు. దీంతో పాటు కటోలి–అంబాలా, అమృత్‌సర్–వారణాసి మధ్య కొత్త రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. ఈ మార్గాలు శ్రీ ఆనంద్‌పూర్ సాహిబ్, మా చింతపూర్ణి ఆలయం వంటి పుణ్యక్షేత్రాలకు ప్రయాణాన్ని సులభతరం చేస్తాయి. పంజాబ్‌లో రూ.3,070 కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు కూడా శ్రీకారం చుట్టారు.

దేశ ఆర్థిక ప్రగతిని వేగవంతం చేయడం, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించడమే ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యమని ప్రధాని కార్యాలయం వెల్లడించింది. ఈ కార్యక్రమానికి ముందు ప్రధాని దేరా సచ్‌ఖండ్ అధిపతి సంత్ నిరంజన్ దాస్‌తో సమావేశమై ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

# 850 కిలోల నెయ్యి సీజ్

### రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల స్పెషల్ డ్రైవ్

### కమిషనర్ సంగీత సత్యనారాయణ వెల్లడి



రాష్ట్రంలో కల్తీ నెయ్యి తయారీ, విక్రయాలపై ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ ఉక్కుపాదం మోపింది. నెయ్యిలో పామాయిల్, వనస్పతి వంటి ఇతర పదార్థాలు, కొవ్వులు కలుపుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా జూలై 14, 15 తేదీల్లో పోలీసుల సమన్వయంతో విస్తృత తనిఖీలు నిర్వహించామని ఫుడ్ సేఫ్టీ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యానారాయణ తెలిపారు.


మిగతా 2లో


### మధ్య ప్రదేశ్ రాష్ట్ర తహసీల్దార్ల ప్రశంస

***సీఎం ప్రజావాణి పని తీరును వివరించిన స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్***

***సీఎం ప్రజావాణిలో 260 దరఖాస్తులు***

సీఎం ప్రజావాణి కార్యక్రమం వినూత్నంగా సాగుతోందని, అందుకే ప్రత్యేకంగా మధ్యప్రదేశ్ రాష్ట్ర వివిధ హోదాలో ఉన్న అధికారులు తరచుగా సీఎం ప్రజావాణిని సందర్శించి కొత్త అంశాలు నేర్చుకుంటున్నామని ఆ రాష్ట్ర తహసీల్దార్లు పేర్కొన్నారు.

శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహించిన 239వ సీఎం ప్రజావాణి కార్యక్రమాన్ని మధ్యప్రదేశ్ తహసీల్దార్లు సందర్శించారు. సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ వారికి ప్రజావాణి పని తీరును వివరించారు.

ప్రజల సమస్యల పరిష్కారంలో సీఎం ప్రజావాణి కేంద్ర బిందువుగా ఉందని వారు కితాబునిచ్చారు.

కాగా శుక్రవారం సీఎం ప్రజావాణిలో 260 దరఖాస్తులు అందాయి.

# వర్షాభావ పరిస్థితులపై

### రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది.




ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఆందోళనకర పరిస్థితులపై కేంద్రానికి లేఖ రాయాలని మంత్రివర్గం నిర్ణయించింది.

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, సాగునీరు, విద్యుత్ రంగాల్లో తీసుకోవలసిన చర్యలపై మంత్రిమండలి సుధీర్ఘంగా చర్చించింది.

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజాభవన్‌లో ఒక టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఈ హెల్ప్ లైన్ ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేశారు. టోల్ ఫ్రీ నంబర్ 1-800-123-7157

తీవ్ర వర్షాభావ పరిస్థితులపై పూర్తి వివరాలతో కేంద్ర ప్రభుత్వానికి నివేదించి నష్టాన్ని అంచనా వేయడానికి ప్రత్యేక బృందాన్ని పంపించాలని కోరాలని భావించింది. అలాగే, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళికల అమలుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని మంత్రిమండలి కేంద్రాన్ని కోరుతూ తీర్మానించింది.

ఈరోజు వరకు రాష్ట్రంలోని ఏ ప్రాంతంలో కూడా సాధారణ వర్షపాతం నమోదు కాలేదని, 30 నుంచి 35 శాతానికి మించి వర్షపాతం నమోదు కాలేదని మంత్రిమండలి ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ పరిస్థితుల్లో అవసరమైన చర్యలు తీసుకోవడానికి అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించింది.

రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఆదేశించింది. విద్యుత్ కోతలు లేకుండా నిరంతర విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించింది.

తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనివ్వాలని నిర్ణయించింది. ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతాంగానికి మంత్రిమండలి విజ్ఞప్తి చేసింది.

వర్షాభావ పరిస్థితులపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రితో పాటు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో ఈ నెల 20న జిల్లాల్లో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, నిపుణులు, శాస్త్రవేత్తలు అందరితో సమావేశాలు నిర్వహించి జిల్లాల వారిగా తలెత్తిన పరిస్థితులు, జరిగిన నష్టంపై సమగ్రమైన నివేదికలు తయారు చేయాలని మంత్రిమండలి తీర్మానించింది.

రాష్ట్ర ప్రణాళిక మండలి వైస్ చైర్మన్ జి చిన్నారెడ్డి సారథ్యంలో వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలతో వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ప్రభావంపై ప్రత్యేక నివేదిక రూపొందించాలని మంత్రివర్గం సూచించింది.

ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన 36వ మంత్రిమండలి సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి జూపల్లి కృష్ణారావు పొన్నం ప్రభాకర్ , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు.

భూముల రికార్డులు, భూముల క్రయ విక్రయాలకు సంబంధించి ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణకు ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేయాలని మంత్రిమండలి నిర్ణయించినట్టు తెలిపారు.

ధరణి పోర్టల్ కు సంబంధించి టెండర్ ప్రక్రియ నుంచి మొదలు ఇటీవల వచ్చిన ఆరోపణల వరకు అన్ని అంశాలపై విచారణ జరిపించాలని నిర్ణయించినట్టు చెప్పారు.

2020 అక్టోబర్ 29 నుంచి ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన రోజు నుంచి ఈనాటి వరకు భూముల రిజిస్ట్రేషన్లు, రికార్డుల మార్పులు, వ్యవసాయ భూములు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల బదలాయింపులు సహా జరిగిన అన్ని అనుమానాస్పద లావాదేవీలను లోతుగా పరిశీలించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు.

రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లను కో-ఆప్టెడ్ సభ్యులుగా నామినేట్ చేసేందుకు తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం--2019ను సవరించే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

గ్రామ పంచాయతీ నిధుల నిర్వహణకు సంబంధించి జాతీయ బ్యాంకులు, సహకార బ్యాంకులు లేదా పోస్టాఫీసుల్లో ఈ నిధులను జమ చేసుకునేలా ప్రతిపాదించిన సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. అందుకు సంబంధించి తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం--2018లో సవరణకు మంత్రిమండలి ఆమోదం ముద్ర

### రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు

### 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్' మహా భరోసా..



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక భరోసా, నమ్మకం కలిగిస్తూ, ఎలాంటి భయాందోళనలు లేని ఒక చక్కటి ఆరోగ్య భద్రత వ్యవస్థను అందించాలనే సదుద్దేశంతో ప్రజా ప్రభుత్వం లి'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్'లిను ప్రవేశపెట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురైతే వైద్య ఖర్చుల కోసం అప్పులపాలై, వాటిని తీర్చలేక సతమతమవుతున్న దుస్థితిని మేము గమనించాం. ఈ పరిస్థితిని మార్చి, వారికి సంపూర్ణ నగదు రహిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఇందిరమ్మ ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు.


మిగతా 2లో

ప్రజాబలం

18 జూలై 2026 శనివారం

# 850 కిలోల నెయ్యి సీజ్

## ఇస్రోలో ఏం జరుగుతోంది,...

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఐఎస్ఆర్వో) ఇటీవలి నెలల్లో తన అనుభవజ్ఞులైన సైంటిస్టులను కోల్పోతోంది. ఈ పరిణామం దేశంలోని అత్యంత ముఖ్యమైన అంతరిక్ష కార్యక్రమాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. దీనిని అడ్డుకోవడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్(డీవోఎస్) తక్షణ చర్యలు తీసుకుంటోంది.కొన్ని నెలలుగా ఐఎస్ఆర్వో నుంచి 100 నుంచి 120 మంది సైంటిస్టులు రాజీనామా చేశారు. ఇందులో అనుభవం, నైపుణ్యం ఉన్న వారు కూడా ఉన్నారు. వంద మందికిపైగా సైంటిస్టులు ఇస్రోను వీడడం మామూలు విషయం కాదు. సంస్థలో ప్రతీ సైంటిస్టు పని అనుభవం, జ్ఞానం అనేది సంస్థకు ఒక ఆస్తి. వంద మందికిపైగా సంస్థను వీడడం మిషన్ల నాణ్యత, టైమ్‌లైన్లపై నేరుగా ప్రభావం చూపుతుంది.భారతదేశం మానవ సహిత అంతరిక్ష యాత్ర (గగన్‌యాన్)వంటి చారిత్రాత్మక మిషన్లను చేపట్టింది. ఇలాంటి ప్రాజెక్టులలో పనిచేసే సైంటిస్టులు రాజీనామా లేదా వాలంటరీ రిటైర్‌మెంట్ కోరినప్పుడు, వాటిని వెంటనే ఆమోదించవద్దని ఇస్రో కేంద్రాలకు డీవోఎస్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. బదులుగా, అలాంటి అభ్యర్థనలను డీవోఎస్‌కు పంపి, అక్కడి నుంచి నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇది సాధారణ ఆదేశం కాదు. కీలక మిషన్లలో పనిచేసే నిపుణులను త్వరగా కోల్పోకుండా రక్షించేందుకు తీసుకున్న జాగ్రత్త చర్య.డీవోఎస్ జోక్యం చేసుకోవడం రెండు విషయాలను స్పష్టం చేస్తోంది. ఒకటి ఇస్రోలోని అనుభవజ్ఞులైన సైంటిస్టులను నిలుపుకోవడం ఎంత ముఖ్యమో అర్థం చేసుకుంది. రెండోది సంస్థలోని మానవ వనరుల నిర్వహణను కేంద్రీకృతం చేయాలనుకుంటోంది. ప్రతి రాజీనామా అభ్యర్థనను వ్యక్తిగతంగా పరిశీలించి, సంస్థకు అవసరమైన నైపుణ్యాలను కాపాడుకోవాలన్నది ఈ ఆదేశాల ముఖ్య ఉద్దేశం. ఇది సంస్థలోని పని వాతావరణం, పరిహారం, కెరీర్ అవకాశాల వంటి అంశాలపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.ఇస్రో వంటి సంస్థలో సైంటిస్టుల రాజీనామాలు కేవలం వ్యక్తిగత నిర్ణయాలు మాత్రమే కావు. అవి సంస్థలోని నిర్వహణ, ప్రోత్సాహకాలు, బాహ్య అవకాశాలు వంటి విస్తృత కారణాలను ప్రతిబింబిస్తాయి. అనుభవజ్ఞులైన వారు బయటకు వెళ్లడం వల్ల కొత్తగా వచ్చే వారికి ఆ జ్ఞానాన్ని బదిలీ చేయడం కష్టమవుతుంది. పని ఒత్తిడి తగ్గించడం, మెరుగైన పరిహారం, కెరీర్ వృద్ధి అవకాశాలు, ప్రైవేట్ రంగంతో పోటీపడే విధంగా విధానాలు రూపొందించడం వంటివి ఆలోచించాల్సిన అవసరం ఉంది.ఇస్రో భారతదేశ అంతరిక్ష లక్ష్యాలకు మూలస్తంభం. దాని విజయం సైంటిస్టుల ప్రతిభ, అంకితభావంపై ఆధారపడి ఉంది. డీవోఎస్ ఇచ్చిన ఆదేశాలు ఈ ప్రతిభను రక్షించడానికి తీసుకున్న ముందస్తు చర్యగా కనిపిస్తున్నాయి. అయితే, ఇది కేవలం ఆదేశాలతో మాత్రమే సాధ్యం కాదు. సంస్థలోని వాతావరణం, అవకాశాలను మెరుగుపరచడం ద్వారానే దీర్ఘకాలికంగా ప్రతిభావంతులను నిలుపుకోవచ్చు.ఇస్రో మెమో గురించి అడిగిన ప్రశ్నకు సింగ్ సమాధానమిస్తూ.. అది కేవలం పరిపాలనా కారణాలతోనే జరిగిందని చెప్పారు. “లేదు, అది ఎందుకంటే... మరింత పరిణతి చెందిన స్థాయిలో నిర్ణయం తీసుకునేందుకు వీలుగా పరిపాలనా కారణాల వల్ల అలా చేశాం” అని కేంద్ర మంత్రి అన్నారు. ఇస్రోలో చాలా మంది ఉద్యోగులు ఉన్నారని, కొందరు వెళ్లిపోతుంటే మరికొందరు కొత్తగా చేరుతుంటారని ఆయన అన్నారు. “చాలా మంది వెళ్లారు, చాలా మంది వచ్చారు” అని చెబుతూ ఈ విషయంలో ఎలాంటి వివాదం లేదని ఆయన స్పష్టం చేశారు. కూడంకుళం అణు విద్యుత్ కేంద్రంలో ఏమీ జరగనప్పుడు సమీక్షించాల్సిన అవసరం ఏముందని మంత్రి ప్రశ్నించారు.ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎస్ సోమనాథ్ చెన్నైకు చెందిన ప్రైవేట్ అంతరిక్ష సంస్థ అగ్నికుల్ కాస్మోస్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ అబ్జర్వర్‌గా చేరారు. జనవరి 2025 వరకు ఇస్రో ఛైర్మన్‌గా కొనసాగిన కాలంలోనే జాబిల్లి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండింగ్, భారత్ తొలిసారిగా సూర్యుడిపై అధ్యయనం కోసం ప్రయోగించిన ఆదిత్య- ఎల్1 వంటి పలు చారిత్రాత్మక మిషన్లు చేపట్టారు.ఇక, భారత భవిష్యత్తు అంతరిక్ష మిషన్లపై అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బదులిస్తూ.. గతంలో ఇస్రో మాజీ చీఫ్ సోమనాథ్ వ్యాఖ్యలను గుర్తుచేశారు. “దాదాపు పదేళ్ల కిందట జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంతరిక్షంలోకి ఒక మనిషిని పంపడం సులభమే కానీ, తిరిగి సురక్షితంగా తీసుకురావడం కూడా అంతే కష్టంతో కూడుకున్న పని అని చెప్పారు..ఆవిధంగానే క్రూ మాడ్యూల్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పుడు సోమనాథ్ ఆ పదవిలో లేనంత మాత్రాన గగన్‌యాన్ మిషన్ ఆగిపోయిందని అర్థం కాదు. అలా జరగదు కూడా. పైగా ఇస్రోలో పనులు నిరంతరాయంగా సాగుతాయి. పదవీవిరమణ చేసినవారు, మాజీ శాస్త్రవేత్తలు ఈ ప్రాజెక్టులలో భాగస్వాములుగా కొనసాగుతారు. అక్కడ పని సంస్కృతి చాలా భిన్నంగా ఉంటుంది” అని జితేంద్ర సింగ్ అన్నారు.యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ , విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ వంటి ఇస్రో కేంద్రాలకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ సోమవారం జారీ చేసిన అంతర్గత మెమోలో కీలక ఆదేశాలు ఇచ్చింది. ప్రతిష్టాత్మక మానవ సహిత అంతరిక్ష యాత్ర ‘గగన్‌యాన్’, ఇతర ముఖ్యమైన మిషన్లతో ముడిపడి ఉన్న గ్రూప్ ‘ఎ’ సైంటిఫిక్, టెక్నికల్ సిబ్బంది రాజీనామాలను లేదా స్వచ్ఛంద పదవీ విరమణ అభ్యర్థనలను సాధారణ పద్ధతిలో ఆమోదించవద్దని ఆదేశించింది.



మొదటి పేజీ తరువాయి

కొన్ని లైసెన్స్ పొందిన సంస్థలు తయారు చేసిన నెయ్యిలో ఇతర కొవ్వులు కలిపినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించగా, మరికొన్ని సంస్థలు ఎలాంటి లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేకుండానే నెయ్యి తయారీ, విక్రయాలు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు గుర్తించారు. సంబంధిత సంస్థల నుంచి నెయ్యి నమూనాలు సేకరించి టెస్టింగ్ కోసం పంపించామని, పరీక్షల ఫలితాల ఆధారంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్ ప్రొడక్ట్స్ స్టాండర్డ్స్ అండ్ ఫుడ్ అడిటివ్స్) రెగ్యులేషన్స్ ప్రకారం నెయ్యిలో 99.5 శాతం పాల కొవ్వు ఉండాలి. తేమ శాతం 0.5 శాతానికి మించకూడదు. నెయ్యిలో పామాయిల్, వనస్పతి వంటి వృక్షజన్య కొవ్వులను కలపడం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం--2006 ప్రకారం నిషేధం అని ఆమె వివరించారు.

**850 కిలోల స్వాధీనం**

హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 14 సంస్థల్లో తనిఖీలు చేపట్టారు. 15 నెయ్యి సాంపిల్స్‌ను సేకరించారు. వినియోగానికి పనికిరాదని గుర్తించిన 60 కిలోల నెయ్యి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. 850 కిలోల అనుమానాస్పద కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఉత్పత్తులను ప్రయోగశాల నివేదికలు వచ్చే వరకు భద్రపరిచి, నివేదికల్లో కల్తీ నిర్ధారణైతే సంబంధిత ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సంగీత సత్యానారాయణ స్పష్టం చేశారు.

వివిధ జిల్లాల్లో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 65 సంస్థలను ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లను పరిశీలించారు. మొత్తం 91 నెయ్యి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. నిబంధనలు ఉల్లంఘించిన 5 సంస్థలకు నోటీసులు జారీ చేశారు.

**వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి**

వినియోగదారులు లైసెన్స్ ఉన్న, విశ్వసనీయ సంస్థల నుంచే నెయ్యి కొనుగోలు చేయాలని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సంగీత సత్యనారాయణ సూచించారు. కొనుగోలు చేసే ముందు ఖీూూూ× లైసెన్స్ నంబర్, మాన్యుఫాక్చరింగ్ లేబుల్‌ను తప్పనిసరిగా పరిశీలించాలని పేర్కొన్నారు. కొనుగోలు బిల్లులను భద్రంగా ఉంచుకోవాలని, కల్తీ ఆహార పదార్థాలు లేదా లైసెన్స్ లేకుండా విక్రయాలు జరుగుతున్నట్లు అనుమానం ఉంటే వెంటనే ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ‘న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్’ మహా భరోసా..

**8 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు సంపూర్ణ నగదు రహిత వైద్యం**

**సీజీహెచ్ఎస్ (CGHS) ప్యాకేజీల కింద 1,816 రకాల చికిత్సలు**

**గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రూ. 10 వేల కోట్ల బిల్లుల చెల్లిస్తోన్నాము.**

**సచివాలయంలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**







శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మాతో కలిసి ‘న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ను ప్రారంభించి ఉద్యోగులకు హెల్త్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న ప్రేమ, చిత్తశుద్ధికి ఈ పథకమే నిదర్శనమని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం.. మానవీయ కోణంతో ఆలోచించి ఈ నిర్ణయం తీసుకుందని ఆయన ఉద్ఘాటించారు.

“ఉద్యోగులు కూడా మన కుటుంబ సభ్యులేనని, వారి యోగక్షేమాలు చూడాల్సిన బాధ్యత మన ప్రభుత్వంపై ఉందనే సదుద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారని, ఉప ముఖ్యమంత్రి హోదాలో నేను ఈ క్యాబినెట్ సబ్ కమిటీకి ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకోగా, నా సహచర మంత్రులు శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు గారు, శ్రీ పొన్నం ప్రభాకర్ గారు, శ్రీమతి సీతక్క గారు సభ్యులుగా వ్యవహరించారు. మేమందరం ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, పకడ్బందీ విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నాం. దాని ప్రతిరూపమే ఈ ‘న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్’” అని వివరించారు. సుమారు 8 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు వారిపై ఆధారపడిన 29.80 లక్షల మంది కుటుంబ సభ్యులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 886 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా ఉద్యోగులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ఉచిత ఇన్‌పేషెంట్ వైద్య సేవలు పొందవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (జ+నూ) ప్యాకేజీ రేట్లకు అనుగుణంగా 1,816 రకాల వైద్య, శస్త్రచికిత్సలను ఈ పథకం కవర్ చేస్తుందని వివరించారు. ఈ పథకం పారదర్శకంగా, సజావుగా సాగేందుకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమాన భాగస్వామ్యంతో ఒక ప్రత్యేక ‘ట్రస్ట్’ ను ఏర్పాటు చేశామన్నారు.

**గత పాలకుల నిర్లక్ష్యం – మా ప్రభుత్వ చిత్తశుద్ధి**

గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు తమ ఆరోగ్య భద్రత కోసం సకల జనుల సమ్మెతో సహా ఎన్నో పోరాటాలు చేసినా ఫలితం శూన్యమని విమర్శించారు. పదేళ్ల పాటు ఉద్యోగుల విజ్ఞప్తులను బుట్టదాఖలు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం బకాయి పెట్టిన దాదాపు రూ. 10 వేల కోట్ల బిల్లులను తమ ప్రభుత్వం మానవీయ కోణంలో క్లియర్ చేస్తోందన్నారు. “ఆసుపత్రి పాలై అప్పులపాలైన ఉద్యోగి కళ్లల్లో ఆందోళన ఉంటే ప్రభుత్వానికి సరైన ఔట్‌పుట్ ఇవ్వలేడు. అందుకే నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బిల్లులను నెలకు రూ.2000 కోట్ల చొప్పున విడుదల చేస్తూ వస్తున్నాం. ప్రతి 15 రోజులకోసారి నేనే (భట్టి విక్రమార్క) స్వయంగా సమీక్షిస్తూ ఒక్క రూపాయి కూడా పెండింగ్ లేకుండా చూస్తున్నాను,” అని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతతో రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు భట్టి తెలిపారు. అందులో భాగంగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచామని, అర్హులైన 1.06 కోట్ల కుటుంబాలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం ఇంతటి చిత్తశుద్ధితో పనిచేస్తున్న నేపథ్యంలో, ప్రతి ఉద్యోగి రెట్టింపు ఉత్సాహంతో, నిబద్ధతతో పనిచేయాలని డిప్యూటీ సీఎం కోరారు. పేదలకు సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఉచిత విద్యుత్, గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు చేర్చడంలో ఉద్యోగులే నిజమైన వారధులుగా పని చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరి డా. క్రిస్టినా జడ్ చోంగ్తూ, ఎడ్యూకేషన్ సెక్రటరి యోగిత రాణా, స్పెషల్ ఛీఫ్ సెక్రటరి జీఏడి బెన్ హర్ మహేష్ దత్ ఎక్కా, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరి సందీప్ కుమార్ సుల్తానియా, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### 9 రూపాయిలకు చేరిన కోడిగుడ్డు ధర

కాకినాడ, జూలై 17, ఆంధ్రప్రదేశ్‌లో కోడి గుడ్డు ధర సామాన్యుడిపై గుదిబండలా మారింది. కోళ్ల ఫారాల వద్దే ఒక్కో కోడి గుడ్డు రూ. 6.95 పైసలతో రికార్డు స్థాయికి చేరుకుంది. ఇప్పటి వరకు ఇదే అత్యధిక ధర కావడం విశేషం. ఫారాల వద్ద రూ. 6.95 పైసలు ఉన్న కోడి గుడ్డు ధర రిటైల్ మార్కెట్‌లో రూ. 8.50 పైసలకు పైగానే పలుకుతుంది. గతేడాది ఇదే రోజున రూ. 4.90 పైసలు ఉండగా ఇప్పుడు డబుల్ అయింది.నిత్యావసర ధరలు రోజురోజుకూ పెరిగిపోతూనే ఉన్నాయి. తాజాగా కోడిగుడ్డు ధర కూడా ఆకాశాన్ని తాకింది. మిడిల్ క్లాస్ ఇళ్లల్లో నాన్ వెజ్‌కి ప్రత్యామ్నాయంగా ఉన్న గుడ్డు ధర చూసి ప్రజలు షాక్ అవుతున్నారు. కోళ్ల ఫారాల దగ్గరే రికార్డు స్థాయికి ధర చేరగా.. ఇక బయట మార్కెట్లలో ఏ రకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సడెన్‌గా పెరిగిన ఈ కోడి గుడ్డు రేటుతో సామాన్యుడు సతమతమవుతున్నాడు.తూర్పుగోదావరి జిల్లాలో కోళ్ల ఫారాలు చాలా ఎక్కువ. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాలకు కూడా ఇక్కడి గుడ్లే ఎగుమతి అవుతుంటాయి. అలాంటి తూర్పు గోదావరి జిల్లాలో కోళ్ల ఫారం వద్దే గుడ్డు ధర రూ. 6.95 పైసలు ఉంది. ఇప్పటి వరకు కోడి గుడ్డు ధర అత్యధికంగా ఉన్న రేటు కూడా ఇదే కావడం విశేషం.తూర్పు గోదావరి జిల్లాలో సాధారణంగా 1.3 కోట్లకు పైగా కోళ్లు ఉండగా రోజుకు కోటి వరకు గుడ్లు ఉత్పత్తి అవుతుండటం సర్వసాధారణం. ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉండటం వల్ల కోళ్లు కూడా చాలా ఎక్కువగానే మృతిచెందాయి. అధికారికంగా ఈ సంఖ్యం 16.35 లక్షలు ఉండగా, అనధికారికంగా 20 లక్షలకు పైగా కోళ్లే మృతి చెందాయని రైతులు చెబుతున్నారు. దాంతో పాటు బతికిన కోళ్లు కూడా పూర్తి స్థాయిలో గుడ్లు పెట్టకపోవడంతో గుడ్ల కొరత ఏర్పడింది.ప్రస్తుతం కోళ్ల ఫారాల వద్ద గుడ్డు ధర రూ. 6.95 పైసలు ఉండగా, అదే బహిరంగ మార్కెట్‌లో రూ. 8.50 పైసలకు పైనే విక్రయిస్తున్నారు. గతేడాది ఇదే రోజు రూ. 4.94 పైసలు ఉండగా ఇప్పుడు ఆ ధర రెట్టింపయింది.

# ఎల్ నినో పట్ల ప్రభుత్వం అప్రమత్తం కావాలి

## (సి.హెచ్.ప్రతాప్)

వాతావరణ మార్పులు ప్రపంచ దేశాలకు సవాలుగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఎల్‌నినో ప్రభావం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించడం అత్యంత అవసరం. సాధారణంగా పసిఫిక్ మహాసముద్రంలోని ఉపరితల జలాల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ఏర్పడే ఎల్‌నినో ప్రభావం ప్రపంచ వాతావరణ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. భారతదేశంలో ఇది ప్రధానంగా నైరుతి రుతుపవనాలపై ప్రభావం చూపి వర్షపాతం తగ్గడానికి, కరువు పరిస్థితులు ఏర్పడడానికి కారణమయ్యే అవకాశం ఉంటుంది.

వ్యవసాయాధారిత దేశమైన భారత్‌లో వర్షాభావం ఆహార ఉత్పత్తిపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. పంటల దిగుబడి తగ్గడం, నీటి నిల్వలు క్షీణించడం, పశుగ్రాసం కొరత, విద్యుత్ ఉత్పత్తిలో అంతరాయాలు వంటి పరిణామాలు ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతాయి. ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం అధికమయ్యే అవకాశం కూడా ఉంటుంది. అందువల్ల ఎల్‌నినోను కేవలం వాతావరణ పరిణామంగా కాకుండా సమగ్ర ఆర్థిక, సామాజిక సవాలుగా పరిగణించాలి.

ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ, వ్యవసాయ శాఖ, జలవనరుల శాఖలు పరస్పర సమన్వయంతో ముందస్తు కార్యాచరణ చేపట్టాలి. వాతావరణ అంచనాలను రైతులకు సకాలంలో చేరవేయడం, తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించడం, విత్తనాలు, ఎరువులు, పంటల బీమా వంటి అంశాల్లో తగిన ఏర్పాట్లు చేయడం అవసరం. చెరువులు, రిజర్వాయర్లలో నీటి నిర్వహణను శాస్త్రీయంగా అమలు చేయడంతో పాటు భూగర్భ జలాల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి.

స్థానిక సంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, శాస్త్రవేత్తలు, రైతు సంఘాల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం కూడా కీలకం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి జిల్లా స్థాయిలో ప్రమాద అంచనాలు రూపొందిస్తే నష్టాలను గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుంది. అదేవిధంగా పశుసంవర్ధక రంగం, తాగునీటి సరఫరా, ప్రజారోగ్య రంగాల కోసం ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధంగా ఉండాలి.

ప్రకృతి వైపరీత్యాలను పూర్తిగా నిరోధించడం సాధ్యం కాకపోయినా, ముందస్తు ప్రణాళిక, సమర్థవంతమైన పరిపాలన, ప్రజల భాగస్వామ్యంతో వాటి ప్రభావాన్ని తగ్గించడం సాధ్యమే. అందుకే ఎల్‌నినో హెచ్చరికలను అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి ప్రభుత్వం సమయోచిత చర్యలు చేపట్టడం దేశ ఆర్థిక స్థిరత్వానికి, రైతుల సంక్షేమానికి, ఆహార భద్రతకు ఎంతో మేలు చేస్తుంది.

# త్వరలో పాలిమర్ నోట్లను విడుదల

## రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా




న్యూ ఢిల్లీ జులై 17; త్వరలో పాలిమర్ నోట్లను విడుదల చేయనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అధికారిక వర్గాలు తెలిపాయి. కొత్త తరం కరెన్సీని ప్రవేశపెట్టాలన్న కేంద్ర బ్యాంకు ప్రణాళికలో తదుపరి దశగా ఈ చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నాయి. వీటిని ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రూ.10, రూ.20 నోట్లను తొలుత తీసుకురానున్నారు. వీటి ఫలితం ఆధారంగా, 2027 నుంచి పూర్తిస్థాయిలో అమలు చేసే దిశగా ఆర్‌బీఐ అడుగులు వేస్తోంది. ప్రస్తుత కాగితపు నోట్లు చలామణిలో కొనసాగుతుండగానే కొత్త పాలిమర్ నోట్లనూ దశలవారీగా ప్రవేశపెట్టనున్నారు. కాగితపు కరెన్సీతో పోలిస్తే ఇవి ఎక్కువ మన్నికగా ఉంటాయి.

# ఘనంగా కోటి పార్థివలింగార్చన మహోత్సవం





వేములవాడ జులై 17:శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్యాత్మిక ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో దోమకొండ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వరి సేవా సమితి సూపర్వైజర్ శ్రీ అనుపాటి లావణ్య పర్యవేక్షణలో శ్రీ శ్రీనివాసు లక్ష్మి వారి ఆధ్వర్యంలో కోటి పార్థివలింగార్చన మహోత్సవము అత్యంత వైభవముగా జరిగినది .

శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి మరియు బాసర శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శివ శ్రీ నిర్మల అంబికానాథ శర్మ పూజాది కార్యక్రమములు చేయించి మాట్లాడుతూ బాసర క్షేత్రంలో 12 జ్యోతిర్లింగాల దేవాలయం ఈశాన్య భాగమున కోటి పార్థివలింగ స్తూపము నిర్మించినామని , ఈ శివలింగములు స్థాపన చేసేదమని, ఆసక్తి గల మహిళా బృందం వారు 9948332032 సంప్రదించి వారి వివరాలు తెలిపినచో పుట్టమన్ను ఉచితముగా ఇచ్చి మీతో శివలింగాలు మరియు పూజ కార్యక్రమాలు చేయించి అట్టి లింగములను కోటి పార్థివలింగ స్తూపం యందు నిక్షిప్తం చేయబడును అని శర్మతెలిపినారు..

బాసర క్షేత్రంలో ఈనెల 19న న జరిగే మాసోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు హోమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు.

బాసర సరస్వతీ స్తూప పార్థివ లింగస్తుప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిర వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాధశర్మ ను వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం సంఘం అధ్యక్షులు కొడిప్యాక మనోహర్ శోభారాణి దంపతులు ఘనంగా సన్మానించారు. దేవాలయ పరిసర కాలిని వాసులు మరియు దేవాలయ ప్రధాన అర్చకులు శ్రీ కమలకాంత్ రావ్ మరియు ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు విజయ, సంతోషి ,స్వప్న ,పద్మ ,శోభారాణి, మంజుల తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మైనర్ బాలిక తో అసభ్య ప్రవర్తన

## స్థానికుల దాడిలో మృతి

హైదరాబాద్ కులసుంపుర పోలీస్ స్టేషన్ లో దారుణం జరిగింది. తొమ్మిదేళ్ల మైనర్ బాలిక పై అసభ్యంగా ప్రవర్తిస్తున్న వీడియోస్ సీసీ టీవీలో రికార్డు ఐయ్యాయి మైనర్ బాలికకు ముద్దు ఇస్తూ, ప్రైవేట్ పార్ట్స్ తాకుతున్న వీడియోస్ బాలిక తల్లి తండ్రులు, స్థానికులు చూసారు. ఆవేశం తో నిందుతుడిపై పేరెంట్స్ డబుల్ బెడ్ రూమ్ వాసులు దాడి చేయగా, ఉస్మానియా హాస్పటల్ లో చికిత్స పొందుతు మృతి చెందాడు. కుల్సుంపుర పోలీస్ స్టేషన్ పరిధిలో ఇందిరమ్మ డబుల్ బెడ్ ట బ్లాక్ లో ఘటన జరిగింది. నిందుతుడు హాజిజ్ అబ్దుల్ నీలోఫోర్ హాస్పిటల్ లో టీ అమ్ముతు జీవనం కొనసాగిస్తున్నాడు. మైనర్ బాలిక 4బిష్త్ర క్లాస్ చదువుతుండగా, పేరెంట్స్ ప్రైవేట్ జాబ్స్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీడియోలు చూసిన స్థానికులు అబ్దుల్ పై దాడి చేసారు. తీవ్ర గాయాలయిన అబ్దుల్ ను పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అబ్దుల్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

## ప్రొఫెసర్ లిల్లీ మేరి



హైదరాబాద్ జులై 17 ; వర్షాకాలంలో ప్రజలే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరమని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ లిల్లీ మేరి పేర్కొన్నారు. అసలే వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ. డెంగీ, మెదడువాపు, మలేరియా వంటి వ్యాధుల నియంత్రణకు దోమతెరలు వాడాల్సి ఉంటుంది. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధుల నుండి బయటకు పడొచ్చని ప్రొఫెసర్ లిల్లీ మేరి సూచిస్తున్నారు. క్యూలెక్స్ దోమ వలన మెదడువాపు వ్యాధి వస్తుంది. దోమ కొట్టిన పది రోజుల లోపు లక్షణాలు బయటపడతాయి. ముఖ్యంగా ఒకటి నుంచి 14 ఏళ్ల పిల్లలకు వచ్చే అవకాశం ఉంది.

జ్వరము తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అసాధారణంగా కళ్ళు తిరుగుతాయి. పక్షవాతానికి గురి అయ్యే ప్రమాదం ఉంది. వాంతులు, విరోచనాలు అవుతాయి.

జాగ్రత్తలు ఇలా ..

దోమతెరలు తప్పనిసరిగా వాడాలి. దోమలు ఇళ్లలోకి రాకుండా కిటికీలు, తలుపులు, సన్నటి జాలీలతో బిగించుకోవాలి. జనావాసాల మధ్య పందులు సంచరించకుండా చూసుకోవాలి . మురుగు, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి. పిల్లలకు జ్వరం వస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించాలి.

చికెన్ గున్యా లక్షణాలు...

చికెన్ గున్యా జ్వరం పగటిపూట కుట్టే పులిదోమా ద్వారా వస్తుంది. తీవ్రమైన జ్వరము, విపరీతమైన కీళ్ల నొప్పులు ఉంటాయి. ఈ వ్యాధి సోకినప్పుడు భరించలేని ఒళ్ళు, కీళ్ల నొప్పులు, జలుబు ఉంటుంది. వెంటనే అశ్రద్ధ చేయకుండా వైద్యుని సంప్రదించాలి.

మలేరియా లక్షణాలు ...

సాయంత్రం పూట జ్వరం రావడం, చలి వణుకు ఉంటుంది. ఈ లక్షణాలను బట్టి చికిత్స చేయించుకోవాలి. రక్త పరీక్ష చేసిన వెంటనే మలేరియా క్రిములు కనబడవు. శరీరంలోకి ప్రవేశించిన తర్వాత కొద్ది రోజులకు మాత్రమే ఇవి రక్త పరీక్షల్లో బయటపడతాయి.

డెంగీ లక్షణాలు ..

ఎడిస్ ఈజిప్టు వైరస్ దోమ వల్ల ఒకరి నుంచి మరొకరికి డెంగ్యూ వైరస్ వ్యాప్తి చెందుతుంది. దోమ కుట్టిన తర్వాత ఐదు నుంచి 8 రకాల లక్షణాలు కనిపిస్తాయి. ఉన్నట్టుండి జ్వరం ఎక్కువగా వస్తుంది. తలనొప్పి అధికమవుతుంది. కంటి కదలికల సమయంలో భరించలేని నొప్పి ఉంటుంది.

బోదకాలు లక్షణాలు...

తరచూ కొద్దిపాటి జ్వరము, ఆయాసం వస్తే బోధకాలు ప్రాథమిక లక్షణాలు. పురుషులలో వరిబీజం ఏర్పడుతుంది. గజ్జల్లో వాపు వస్తుంది. నిర్ధారణకు రాత్రి సమయంలో రక్త నమోనాలు సేకరిస్తారు. బాధితుడు విశ్రాంతి సమయంలో పరాన జీవులు రక్తప్రసరణ వ్యవస్థలో ప్రవేశిస్తాయి. ఐదు నెలల్లో ప్రౌఢ జీవులుగా వృద్ధి చెందుతాయి. ఇలా శరీరంలో ఆరేళ్లపాటు జీవించే ఈ పరాన్న జీవులు లక్ష సంఖ్యల్లో ఉత్పత్తిఅయ్యి శోషణ వ్యవస్థలోకి చేరుతాయి. దీంతో శరీర అవయవాలు అసాధారణ వాపునకు గురవుతాయి.

దోమతెరలు వినియోగించాలి: ప్రొఫెసర్ లిల్లీ మేరి

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. దోమల నివారణకు కాయిల్స్, లిక్విడ్స్, వ్యాప రేంజర్ల కన్నా దోమతెరలు వినియోగిస్తే ఫలితం ఉంటుంది. ముఖ్యంగా పరిసరాలతో పాటు వ్యక్తిగతంగా పరిశుభ్రత పాటించాలి అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ లిల్లీ మేరి సూచిస్తున్నారు.

# ఫీజుల స్కీము ఎత్తి వేయాలనే కుట్రలు మానుకోవాలి

## Go.No.9 రద్దు చేసి - పాత పద్దతిలో ఈ స్కీమును అమలు చేయాలి.

## ఫీజుల బకాయిలు 8వేల కోట్లు చెల్లించాలని హైదరాబాద్ కలెక్టరేట్ ముట్టడి.

హైద్రాబాద్ జులై 17:రాష్ట్రంలో 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయిలు 8 వెలకోట్లు వెంటనే విడుదల చేయాలని, ఈ స్కీము ఎత్తివేయాలనే కుట్రలు మానుకోవాలని, ఈ స్కీమునుయధాతథంగా పాత పద్ధతిలోనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేటుముట్టడించారు. ఈ ప్రదర్శనకు రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం కన్వీనర్ నిఖిల్ పటేల్, నీల వెంకటేష్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా విద్యార్థు అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహిస్తూ మాకు న్యాయం చేయండి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు




ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఈ స్కీముకు బడ్జెట్ ఇవ్వకుండా ముఖ్యమంత్రి పేద కులాల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు చదువుకుంటుంటే కూడా ఓర్వలేక పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు. పేద కులాలు చదువుకోకుండా కుట్రలు చేస్తున్నారు. ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని రద్దు చేసి కుట్ర చేస్తున్నారు అంటే 23 వేల ప్రభుత్వ పాఠశాలను రద్దు చేస్తామని బహిరంగంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. అలాగే ఎంతో ఉన్నత విద్య ప్రమాణాలతో బలహీన వర్గాల జీవితాల మార్పు, అభివృద్ధి చేస్తున్న గురుకులాలను కులాల పేరు మీద వద్దు అంటూ పెద్ద సంస్కర్త లాగా పలుకుతూ రద్దు చేసే కుట్రకు తెర తీస్తున్నారని విమర్శించారు.

ఈ ముట్టడి కార్యక్రమంలో చేరుకుల రాజెందర్ ,నిఖిల్ ఎటిట్, అనంతయ్య, , కిరణ్ కుమార్, మోహన్ వంశీ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాదయాత్రలకు నేతలు..

హైదరాబాద్, జూలై 17, మరో ఏడాది తర్వాత తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పాదయాత్రల సందడి మొదలుకానుంది. ఎన్నికలకు ముందు ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రధాన పార్టీలు మరోసారి పాదయాత్రలను ప్రధాన రాజకీయ ఆయుధంగా ఎంచుకుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు రెండేళ్ల ముందు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపడతానని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. మరోవైపు తెలంగాణలో వచ్చే ఏడాది రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర నిర్వహిస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. దీంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్ష ప్రధాన పార్టీలు ప్రజలతో నేరుగా మమేకమయ్యే వ్యూహాన్ని అమలు చేయనున్నట్లు స్పష్టమవుతోంది. రానున్న ఎన్నికల రాజకీయాల్లో ఈ పాదయాత్రలు కీలక పాత్ర పోషించే అవకాశాలు కనిపిస్తున్నాయి. జగన్‌కు పాదయాత్ర కొత్త కాదు. 2019 ఎన్నికలకు ముందు 2017 నవంబర్‌లో ప్రారంభించిన 'ప్రజా సంకల్ప యాత్ర'ను 2019 జనవరిలో ముగించారు. 341 రోజుల పాటు సాగిన ఈ యాత్రలో ఆయన 3,648 కిలోమీటర్లకు పైగా నడిచి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను కలుసుకున్నారు. ఆ పాదయాత్ర అనంతరం జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. అయితే 2024 ఎన్నికల్లో పరాజయం పాలైన తర్వాత మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు జగన్ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. మరోవైపు కేటీఆర్ కు ఇది తొలి పాదయాత్ర కానుంది. ఇప్పటివరకు ఆయన రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేపట్టలేదు.

## బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శిగా చిన్న కేసి ఎల్లయ్య



హైద్రాబాద్ జులై 17 ;బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శిగా చిన్న కేసి ఎల్లయ్య నియమితులయ్యారు ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఎల్లయ్యకు నియామక పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ హైదరాబాదులోబిసి లు ముక్యంగా విద్యార్థులు యువత బిసి ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి చేస్తూ పెద్ద ఎత్తున పోరాట చేయాలని పిలుపునిచ్చారు ముఖ్యంగా బీసీ విద్యార్థులకు స్కాలర్ షిప్ లు ఫీజు రియంబర్స్మెంట్ పై ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలని ఆయన పేర్కొన్నారు .అనంతరం ఎల్లయ్య మాట్లాడుతూ తనపై గల నమ్మకంతో తనకు గ్రేటర్ హైదరాబాద్ యువజన సంఘం ప్రధానకార్యదర్శిగా నియమించినందుకు ఆర్ కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు హైదరాబాద్ పరిధిలో బీసీల సమస్యలు విద్యార్థుల సమస్యల పరిహకారం కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు.

## నూర్ భాషా దూ దేకులకు కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

### నూర్ బాషా దూదేకుల కులస్తులకు రెండు ఎకరాలు భూమిని తక్షణమే అందజేయాలి



హైద్రాబాద్ జులై 17; నూర్ భాషా దూదేకుల కులం వారికి కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ,రెండు ఎకరాలు భూమిని తక్షణమే అందజేయాలని నూర్ బాషా దూదేకుల సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది.

శుక్రవారం హైద్రాబాద్ లో మీడియా సమావేశం లో తెలంగాణ స్టేట్ నూర్ భాషా ముస్లిం దూదేకుల మైనారిటీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఎంఏ ఖదీర్ ,నూర్ బాషా బాబా ఫక్రుద్దీన్ , రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ మరియు ఆజం నల్లగొండ జిల్లా దూదేకుల నూర్ భాషా సంఘం అధ్యక్షుడు యూసుఫ్ లు మాట్లాడుతూ

టిఆర్ఎస్ ప్రభుత్వం లో కోకాపేటలో రెండు ఎకరాల భూమి దూదేకుల కులస్తులకు కేటాయిస్తామని ప్రకటించడం జరిగింది కావున ఆ రెండు ఎకరాలు భూమిని తక్షణమే కులాలకు అందజేయాలని కోరారు

నూర్ భాషా దూదేకుల జేఏసీ 2016 లోనే ఏర్పడినది దీనికి అధ్యక్షులుగా షేక్ బాబ్జాని గారు ఉన్నారు జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా షేక్ ఫకీర్ సాహెబ్ బాధ్యతలు నిర్వహించారు సుదీర్ఘ కాలంగా దూదేకుల కులస్తుల కోసం తమ పోరాటాన్ని సాగించి అకస్మాత్తుగా మరణించడం జరిగింది ఆ తర్వాత దూదేకుల కులస్తులందరూ ఏకమై షేక్ సయ్యద్ బాషా గారికి వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నుకోవడం జరిగింది అప్పటినుంచి దూదేకుల కులస్తుల కోసం తమ బు జ స్కందాలపై మో సుకుంటూ నూర్ భాషా దూదేకుల కులాలకు జరుగుతున్న అన్యాయం కోసం నిరంతరం ఇప్పటికీ పోరాడుతూనే ఉన్నారు ఈ మధ్యలోనే కొత్తగా జేఏసీ ఏర్పాటు చేసినారు వీళ్లు వాళ్లంతట వాళ్ళు ప్రకటించుకుని ఏ రోజు కూడా కులం కోసం పిల్లల భవిష్యత్తు కోసం పోరాటం చేసిన వ్యక్తులు కారు అప్పటి వ్యక్తులు అయినటువంటి బాబ్జాని గారు వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సయ్యద్ బాషా మరియు దీర్ఘకాలకం కాలంగా కులం కోసం తాపత్రయ పడుతున్న పెద్దలు సత్తార్ అందరూ కలిసి కులంలో జరుగుతున్న అన్యాయం గురించి వివరించి వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు అప్పటి ప్రభుత్వం లో ఉన్నటువంటి బీసీ మంత్రివర్యులు గంగుల కమలాకర్ కూడా దూదేకుల కులస్తులకు మరియు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి దూదేకుల పిల్లలకు విద్యలో ఉద్యోగాల్లో అన్యాయం జరుగుతున్నది అని వినతి పత్రం ఇవ్వడం జరిగింది అంతేకాకుండా అప్పటి బీసీ కమిషనర్ కృష్ణమోహన్ కు మరియు మైనారిటీ మంత్రివర్యులు కొప్పుల ఈశ్వర్ గారికి అప్పటి హోమ్ మినిస్టర్ మహమ్మద్ అలీ కి మరియు విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రా రెడ్డి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.అలాగే ఇప్పటి ప్రభుత్వంలో ఢిల్లీ దీక్ష వేదికలో గ్రంథాలయ చైర్మన్ రియాజ్ ద్వారా తెలంగాణ స్టేట్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వినతి పత్రం సమర్పించడం జరిగినది అప్పుడు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి నూర్ భాషా దూదేకుల కులస్తు లకు గ్రామీణ ప్రాంతాల నుండి అన్యాయం జరుగుతూనే ఉన్నది కాబట్టి వీళ్ళకు న్యాయం చేయడం సమంజసమైన పద్ధతి అని గ్రహించి పది రోజులనే దూదేకుల కులస్తులకు ఒక స్కీం లో ప్రత్యేక స్థానం కల్పించినారు కావున మేము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి చేయు వినతి ఏమనగా అన్ని కులాల వారికి కార్పొరేషన్లు ఇవ్వడం జరిగింది నూర్ భాషా కులంలో కూడా కార్పొరేషన్ ఇవ్వవలసిందిగా కోరనైనది అంతేకాకుండా టిఆర్ఎస్ ప్రభుత్వం లో కోకాపేటలో రెండు ఎకరాల భూమి దూదేకుల కులస్తులకు కేటాయిస్తామని ప్రకటించడం జరిగింది కావున ఆ రెండు ఎకరాలు భూమిని తక్షణమే కులాలకు అందజేయాలని మనవి అంతేకాకుండా విద్య ఉద్యోగాలలో దూదేకుల కులస్తులకు న్యాయం చేయాలని కోరారు.

## ఒంటరి మహిళా రైతులకు ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక ప్రోత్సాహకం .. జిల్లా కలెక్టర్ కోయశ్రీ హర్ష



**పెద్దపల్లి, జూలై – 17, ప్రజాబలం ప్రతినిధి** :ఎల్‌నినో ప్రభావం వల్ల రైతులు నష్టపోకుండా వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఒంటరి మహిళా రైతులకు ఆయిల్ పామ్ సాగు పై ప్రత్యేక ప్రోత్సాహకం అందిస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా నాణ్యమైన మొక్కల సరఫరాతో పాటు అంతర పంటల సాగు, తోట నిర్వహణ కోసం నాలుగు సంవత్సరాల పాటు ప్రభుత్వం రాయితీలు అందజేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఈ పంట ద్వారా రైతులు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో పట్టా భూమి కలిగి ఆయిల్ పామ్ సాగు చేయదలచిన ఒంటరి మహిళా రైతులకు ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం అందించే నాలుగు సంవత్సరాల రాయితీలతో పాటు, రైతుకు అయ్యే అదనపు వ్యయాన్ని జిల్లా కలెక్టర్ ఆధీనంలోని నిధుల ద్వారా ప్రత్యేక రాయితీగా అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించడం, రైతులను ప్రత్యామ్నాయ లాభదాయక పంటల వైపు ప్రోత్సహించడం, అలాగే ఒంటరి మహిళలను ఆర్థికంగా స్వావలంబన సాధించేలా చేయడం ప్రధాన లక్ష్యంగా ఈ ప్రత్యేక ప్రోత్సాహకాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన ఒంటరి మహిళా రైతులు ఈ ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆయిల్ పామ్ సాగు చేపట్టి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను పొందాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం సమీప ఉద్యాన శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# చంద్రుగొండ మండలంలో అభివృద్ధి పండుగ

### ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీలు రేణుక చౌదరి, రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

### మద్దుకూరులో రైతుల చిరకాల స్వప్నం.. సీతారామ కాలువ నీటి విడుదల

### 35 లక్షలతో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన

**చంద్రుగొండ ప్రతినిధి జూలై17 ప్రజాబలం:**చంద్రుగొండ మండలంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు రైతులకు మేలు చేకూర్చే సాగునీటి విడుదల కార్యక్రమాలు అత్యంత ఘనంగా జరిగాయి.

ఈ కార్యక్రమాలలో తెలంగాణ రాష్ట్ర రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి, ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి,అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ,జిల్లా పిఓ రాహుల్ గ్రంథాలయం చైర్మన్ వీరబాబుగారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.



మొదటగా మద్దుకూరు గ్రామంలో రైతుల చిరకాల స్వప్నమైన సీతారామ కాలువ నుండి పొలాలకు సాగునీటి విడుదల కార్యక్రమాన్ని నేతలు ఘనంగా ప్రారంభించారు. కాలువ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నీటిని విడుదల చేసిన అనంతరం చంద్రుగొండ మండలం పరిధిలోని తుంగారం గ్రామ పంచాయతీ పరిధిలో రూ. 5 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సి సి రోడ్లను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అలాగే చంద్రుగొండ మండల కేంద్రంలో రూ. 35 లక్షల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన నూతన లైబ్రరీ (గ్రంథాలయ) భవన నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ భవనం త్వరలోనే యువతకు, విద్యార్థులకు అందుబాటులోకి రానుందని ప్రజాప్రతినిధులు తెలిపారు. చివరగా, మండల ప్రజల రవాణా సౌకర్యాల దృష్ట్యా ఆధునీకరించిన బస్టాండ్‌ను అత్యంత ఘనంగా పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మండల ప్రజలు, నాయకులు తమ ప్రియతమ ప్రజాప్రతినిధులకు ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు, రైతులు పాల్గొన్నారు.





# కార్గిల్ లేక్ సుందరీకరణ

### అమృత్ 2.0 కింద రూ.1కోటి 32 లక్షలతో పనులు

### కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

### హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే

**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై -17( ప్రజాబలం ప్రతినిధి)**అమృత్ 2.0 కింద సిరిసిల్ల పట్టణంలోని కార్గిల్ లేక్ బండ్ సుందరీకరణ పనులు గడువులోగా పూర్తి చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశించారు.అమృత్ 2.0 స్కీం కింద రూ.కోటి 32 లక్షలతో సిరిసిల్ల పట్టణంలోని కార్గిల్ లేక్ చెరువు పునరుద్దరణ, సుందరీకరణ పనులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి శు క్రవారం శంకుస్థాపన చేశారు. లేక్ పరిసరాలను అధికారులతో కలిసి పరిశీలించారు. కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్లకు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ..కార్గిల్ లేక్ చెరువు పునరుద్దరణ, సుందరీకరణ పనులను కాంట్రాక్టర్ నిర్ణిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.లేక్ లోకి మురుగునీరు రాకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. లేక్ సుందరీకరణతో సిరిసిల్ల పట్టణంతోపాటు జిల్లా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని వివరించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్, డీఎస్పీ నాగేంద్రచారి, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.





## ఇద్దరు పిల్లలను బావిలో తోసి, తానూ దూకి ఆత్మహత్య చేసుకున్న తల్లి

రంగారెడ్డి భర్తతో గొడవ పడి ఒక భార్య తన ఇద్దరు పిల్లాలను బావిలో తోసి, తానూ దూకి ఆత్మహత్య చేసుకుంది. కొడంగల్ నుంచి వచ్చి వసంత (35), సుధాకర్ దంపతులు శంకర్పల్లి పరిధిలోని కొత్తపల్లిలో స్థిరపడ్డారు. గురువారం రాత్రి భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో ఇద్దరు పిల్లలను(కూతురు (15), కొడుకు (10))బావిలో తోసి, అనంతరం తాను కూడా దూకి ఆత్మహత్య చేసుకుంది. అదృష్టవశాత్తూ , బాలుడు చెట్టు కొమ్మకు చిక్కుకుని ప్రాణాలతో బయటపడ్డాడు.

# అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తాం: జిల్లా కలెక్టర్ మను చౌదరి




**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి, జూలై 17:**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు మీడియా అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని జిల్లా కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు.

శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే--ఐజేయు) రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతుల వెంకట్రాం రెడ్డి, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా పరిధిలో జర్నలిస్టులుగా పనిచేస్తున్న అర్హులైన సీనియర్ రిపోర్టర్లందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

టీయూడబ్ల్యూజే ప్రతినిధులు మాట్లాడుతూ, నిబంధనల పేరుతో అర్హులైన జర్నలిస్టులకు ఇబ్బందులు కలగకుండా అందరికీ అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని కోరారు. కార్డుల జారీలో జాప్యం లేకుండా ప్రక్రియను వేగవంతం చేయాలని, అవసరమైన సహకారాన్ని అక్రిడిటేషన్ కమిటీ అందిస్తుందని తెలిపారు.

కమిటీ ప్రతినిధుల వినతిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే అర్హులైన జర్నలిస్టులందరికీ న్యాయం జరుగుతుందని టీయూడబ్ల్యూజే నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ సభ్యుడు మల్కయ్య, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవిచంద్ర, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు రామారావు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రవికిరణ్ రెడ్డి, డబ్ల్యూజేఏ ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యూపీహెచ్‌సీలో వైద్య సేవలు మెరుగుపర్చాలి సఫిల్‌గూడ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి డా. కె. ఆనంద్



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, జూలై 17:**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా సఫిల్‌గూడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో అందిస్తున్న వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ సూచించారు. శుక్రవారం ఆయన ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు.

ఈ సందర్భంగా ఓపీ, ల్యాబ్ రిజిస్టర్‌లను పరిశీలించిన ఆయన నమోదులను నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఫార్మసీని తనిఖీ చేసి మందుల నిల్వలు, బఫర్ స్టాక్‌ను పరిశీలించారు. గడువు సమీపిస్తున్న మందులను గుర్తించి, వాటి వినియోగం, నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

మాతా--శిశు ఆరోగ్య (ఎంసీహెచ్) సేవలను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని, గర్భిణుల నమోదు, ప్రసవానంతర సేవలు, శిశు టీకాల కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

అదేవిధంగా క్షయవ్యాధి (టీబీ) కేసులను ముందస్తుగా గుర్తించి, చికిత్స పొందుతున్న రోగులను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. వారికి ప్రభుత్వం అందించే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షయవ్యాధి నిర్మూలన లక్ష్య సాధనకు క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతమైన పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు.

ఈ తనిఖీలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సామాజిక బాధ్యతతో పనిచేసే పాత్రికేయులు సమాజానికి బలమైన అండ'' -- జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, జూలై 17:** సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణలో పోలీసులు--పాత్రికేయులు సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే అన్నారు.వేములవాడ పట్టణంలోని నాంపల్లి చెరువు ఎదురుగా ఉన్న వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన రహదారి భద్రత--రోడ్డు ప్రమాదాల నివారణ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం స్థానిక పాత్రికేయులతో ఎస్పీ సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన రహదారులపై తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, ట్రాఫిక్ సమస్యలు ఉన్న ప్రాంతాలు, అక్రమ గంజాయి రవాణా, విక్రయాలు లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజల భద్రతకు సంబంధించిన అంశాల్లో మీడియా అప్రమత్తంగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని సూచించారు.ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంచడంలో, సామాజిక బాధ్యతతో వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని ఎస్పీ ప్రశంసించారు. ప్రజల సహకారం, పాత్రికేయుల సమన్వయంతో సురక్షితమైన సమాజ నిర్మాణానికి పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ సమావేశంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజా భాగస్వామ్యం తదితర అంశాలపై పాత్రికేయులతో ఎస్పీ అభిప్రాయాలను పంచుకున్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి బీఎల్‌వోలకు జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశం



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, జూలై 17:**ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణను వేగవంతం చేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి బీఎల్‌వోలకు సూచించారు.

శుక్రవారం అల్వాల్ మండలంలోని 9వ పోలింగ్ కేంద్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, పూరించిన ఫారాల స్వీకరణలో పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. ఫారాలు పూరించే సమయంలో ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ వారికి అవగాహన కల్పించాలని సూచించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు స్వీకరించిన ఫారాలను వెంటనే డిజిటలైజ్ చేయాలని బీఎల్‌వోలకు ఆదేశించారు. ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

అందుబాటులో లేని ఓటర్ల వివరాలను వెంటనే సంబంధిత సూపర్వైజర్లకు అందజేయాలని సూచించారు. రోజువారీ లక్ష్యాలను పూర్తిచేసేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, ఇందుకు అవసరమైన సూచనలు, సలహాలను బీఎల్‌వోలకు అందించారు.

# పట్లూర్ ఏ వన్ హోటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ జెడ్పిటిసి మధుకర్




**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జూలై 17(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూరు గ్రామంలో యువత స్వయం శక్తితో ముందుకు ఎదగాలనే పట్టుదలతో ఏ వన్, హోటల్, ఎర్రగట్టు ఫెరోజ్ బ్రదర్స్, ప్రారంభించడం జరిగిందని మర్పల్లి మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ షఫీయో దిన్ తెలిపారు, ప్రారంభోత్సవ కార్యక్రమంలోమాజీ జెడ్పిటిసి ప బ్బే మధుకర్ , మాజీ సర్పంచ్ దేవరదశి ఇందిరా అశోక్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు షఫీయో దిన్ , కోపరేషన్ నెంబర్ సోహెల్ షరీఫ్, కాజమైనో దిన్, పట్లూర్ కానిస్టేట్ సర్పంచ్ అభ్యర్థి బానోత్ సునీల్ కుమార్ , గోపాల్, రాజు ,పాపయ్య,ఫిరోజ్, సలీం భాయ్ , సమాజ్ ,జాకీర్, బి ఆర్ ఎస్ నాయకులు పెద్దలు పెద్ద ఎత్తున ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు




# స్వీయ రక్షణే కుటుంబ క్షేమం హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరి: జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి జూలై 17:** రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారానే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు.

'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా వేములవాడ మండలంలోని నాంపెల్లి వద్ద వెంకటేశ్వర కళ్యాణ మండపంలో శుక్రవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, వాహనదారులు, ప్రజాప్రతినిధులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో జనవరి నెల నుంచి ప్రతి నెలా 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, మైనర్లు వాహనాలు నడపడం వంటి కారణాల వల్లే ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో జరిగిన ప్రమాదాల్లో హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ప్రధాన కారణాలుగా ఉన్నాయని తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ పోలీసుల కోసం కాదని, స్వీయ రక్షణతో పాటు కుటుంబ సభ్యుల క్షేమం కోసం ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా వాటిని ధరించాలని సూచించారు.ప్రధాన రహదారుల వెంట ఉన్న చెట్లకు రాత్రి సమయంలో స్పష్టంగా కనిపించేలా రేడియం స్టికర్లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో రబ్బర్ స్పీడ్ స్ట్రిప్స్, ఇసుక డ్రమ్‌లు, బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. అలాగే ప్రమాదంలో గాయపడిన వారిని 'గోల్డెన్ అవర్'లో ఆసుపత్రికి తరలించిన వారికి ప్రభుత్వం రూ.25 వేల ప్రోత్సాహక నగదు అందజేస్తోందని గుర్తు చేశారు.అనంతరం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేసిన ఎస్పీ, నాంపెల్లి నుంచి అనుపురం వరకు ప్రధాన రహదారి వెంబడి చెట్లకు రేడియం స్టికర్లను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, రవీందర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## వేములవాడ డంప్ యార్డ్ అభివృద్ధికి రూ.49 లక్షలు మంజూరు

### మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి జూలై -17** వేములవాడ పట్టణ సమీపంలోని డంప్ యార్డ్‌లో ప్రధాన రహదారి, మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.49 లక్షలు మంజూరైనట్లు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు తెలిపారు. త్వరలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభిస్తామని చెప్పారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్, అధికారులతో కలిసి డంప్ యార్డ్‌ను పరిశీలించి పనులపై సమీక్షించారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతోనే ఈ నిధులు మంజూరయ్యాయని పేర్కొన్న ఆయన, పట్టణ అభివృద్ధికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు

## లబ్ధిదారులకు రుణాలు సకాలంలో అందించాలి

### -- ఎల్డీఎం సుధీర్ రెడ్డి




**జహీరాబాద్, జూలై 17 ప్రజాబలం ప్రతినిధి:** ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో బ్యాంకుల పాత్ర అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి రుణాలు సకాలంలో మంజూరయ్యేలా బ్యాంకర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సుధీర్ రెడ్డి సూచించారు. జహీరాబాద్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సంయుక్త మండల స్థాయి బ్యాంకర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ స్వయం ఉపాధి, సంక్షేమ పథకాల కింద అందుతున్న రుణాలను అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా మంజూరు చేయాలని సూచించారు.

మహిళా స్వయం సహాయక సంఘాలు, నిరుద్యోగ యువత, చిన్న వ్యాపారులు, రైతులు వంటి వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ రుణాల పంపిణీ చేపట్టాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన వార్షిక రుణ లక్ష్యాలను ప్రతి బ్యాంకు తప్పనిసరిగా పూర్తి చేయాలని, శాఖల వారీగా లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిశీలించి, అర్హత ఉన్నవారికి ఆలస్యం చేయకుండా ఆమోదించాలని చెప్పారు. చిన్న చిన్న సాంకేతిక కారణాలతో దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలను వెంటనే పరిష్కరించాలని బ్యాంకు అధికారులకు సూచించారు.

ప్రభుత్వ శాఖల అధికారులు, బ్యాంకర్లు పరస్పర సహకారంతో పనిచేస్తేనే సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారులకు చేరుతాయని ఎల్డీఎం పేర్కొన్నారు. రుణాల మంజూరులో పారదర్శకత, వేగం ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి దరఖాస్తును బాధ్యతాయుతంగా పరిశీలించాలని ఆయన సూచించారు.

## సీతారామ ప్రాజెక్టు క్రెడిట్ కేసీఆర్‌దే..

## కాంగ్రెస్‌ది క్రెడిట్ చోరీ

### సత్తుపల్లిలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర విమర్శలు



**సత్తుపల్లి ప్రజాబలం ప్రతినిధి జూలై 17 :** దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ "ఓటు చోరీ" గురించి మాట్లాడుతుంటే, తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం "క్రెడిట్ చోరీ"కి పాల్పడుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. సత్తుపల్లి పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య కార్యకర్తలకు ఎస్ఐఆర్ పై అవగాహన కల్పించారు.



సీతారామ ప్రాజెక్టు రూపకల్పన, నిర్మాణానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషే కారణమని, అయితే ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు ఆ ప్రాజెక్టు క్రెడిట్ కోసం పోటీ పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఒక మంత్రి పర్యటన గురించి మరో మంత్రికి తెలియని పరిస్థితి నెలకొనడం అధికార పార్టీలోని అంతర్గత విభేదాలకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.

ఎల్‌నీనో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశమున్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టలేదని సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. ప్రజల నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చిన తర్వాతే పంపులు ప్రారంభించారని, ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితులు రెండో ఎండాకాలాన్ని తలపిస్తున్నాయని అన్నారు. గోదావరి జలాలను సమర్థంగా వినియోగించి రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏ సర్వే చూసినా రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేసిన ఆయన, కేసీఆర్ హయాంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అలాగే రాష్ట్రంలో పోలీసులు కూడా కాంగ్రెస్ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫుడ్ పాయిజన్ బాధితులను పరామర్శించిన

### జిల్లా వైద్య , ఆరోగ్య అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై 17 (ప్రజాబలం ప్రతినిధి)**సిరిసిల్ల పట్టణంలోని ఓ హోటల్‌లో ఆహారం తీసుకున్న అనంతరం అస్వస్థతకు గురై ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, రాజన్న సిరిసిల్లలో చికిత్స పొందుతున్న బాధితులను జిల్లా వైద్య , ఆరోగ్య అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ ఈరోజు పరామర్శించారు.ఆసుపత్రిలోని ప్రతి వార్డును సందర్శించి బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోగికి అవసరమైన వైద్య సేవలు, మందులు, ద్రవ చికిత్స( ఐవి ఫ్లూయిడ్స్) మరియు ఇతర వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, అనుమానాస్పద పరిస్థితుల్లో విక్రయించే ఆహార పదార్థాలను తినరాదని సూచించారు. ఆహారం తీసుకున్న తర్వాత వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు, సంబంధిత విభాగాల అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వార్డు అభివృద్ధికి కేంద్ర మంత్రి బండి సంజయ్ సానుకూల స్పందన

### 18వ వార్డు కౌన్సిలర్ మేరుగు-మంజుల-శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై 17 (ప్రజాబలం ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ని 18వ వార్డు కౌన్సిలర్ మేరుగు మంజుల-శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా వార్డులో ఉన్న సమస్యల గురించి మంత్రికి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని.ప్రధానంగా 18వ వార్డులో సీసీ రోడ్లు, సీసీ డ్రైయిన్ల నిర్మాణం, హైమాస్ట్ లైట్ల ఏర్పాటుతో పాటు వార్డు సమగ్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు. కౌన్సిలర్ విన్నపంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సానుకూలంగా స్పందించారని, వార్డు అభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని కౌన్సిలర్ మేరుగు మంజుల-శ్రీనివాస్ తెలియజేశారు.

## ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు ప్రజాప్రతినిధులు

### సమన్వయంతో పనిచేయాలి ఎంపీ సురేష్ షెట్కర్

**కామారెడ్డిప్రజాబలం ప్రతినిధి:** ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీ సురేష్ షెట్కర్ చెప్పారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో దిశ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు, జిల్లా దిశా కమిటీ చైర్మన్ సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యుడు సురేష్ షెట్కర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో అందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.వ్యవసాయం, నీటిపారుదల, రహదారులు, రహదారి భద్రత, బ్యాంకింగ్, విద్య, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించి, కిసాన్ క్రెడిట్ కార్డులు, పంట బీమా, ఇతర ఆర్థిక సహాయ పథకాల అమలును మరింత వేగవంతం చేయాలని పేర్కొన్నారు.జాతీయ రహదారులపై రహదారి ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలను పటిష్టం చేయాలని, తాగునీరు, సాగునీటి సౌకర్యాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి, అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులకు ఆరుతడి పంటలపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రతి ఒక్కరికి ఉపాధి లభించేలా క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి తనవంతుగా సహకారం అందించి అభివృద్ధి పనులను వేగవతానికి కృషి చేస్తానని, ప్రజలకు కావలసిన మౌలిక వసతులను సంబంధిత శాఖ అధికారులు కల్పించాలన్నారు. అనంతరంజిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు చేసిన సూచనలను సంబంధిత శాఖలు కార్యాచరణ ప్రణాళికతో అమలు చేయాలని, శాఖల మధ్య సమన్వయం పెంపొందించి అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.




ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర. మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి. అదనపు కలెక్టర్ విక్టర్ అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ యన్ వై గిరి. డి ఆర్ డి ఏ దామోదర్ రెడ్డి.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# డీ లిమిటేషన్ బిల్లుకు కాంగ్రెస్ సపోర్టా....

# రేవంత్ వాదనేంటీ

హైదరాబాద్, జూలై 17, తెలంగాణా ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి మరో రెండు టెర్ములు తనదే అధికారం అని ప్రతీ సభలో చెబుతూ ఉంటారు. రాసి పెట్టుకోండి అని ఆయన అంటున్నారు. ఇక తాజాగా ఆయన ఖమ్మం సభలో అయితే మీడియాకు నంబర్ చెప్పి మరీ మాకు 2029 లో వచ్చే సీట్లు ఇవ్వే లెక్క కరెక్ట్ అని పక్కాగా చెప్పారు. మాకు 117 సీట్లు వస్తాయని ఆయన అన్నారు. తెలంగాణాలో సీట్లు 182 దాకా పెరుగుతాయని అందులో 117 ఒక్క కాంగ్రెస్ కే సొంతంగా వస్తాయని ఆయన స్పష్టం చేశారు. : ఇదిలా ఉంటే రేవంత్ రెడ్డిని ఎవరు తక్కువగా అంచనా వేసినా పప్పులో కాలేసినట్లే అని అంటున్నారు. అలాగే 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేతలు లైట్ తీసుకున్నారు. దానికి గానూ ఏకంగా భారీ మూల్యం చెల్లించి గద్దె దిగాల్సి వచ్చింది. మరి ఇపుడు చూస్తే రేవంత్ రెడ్డి అధికారంలో ఉన్నారు. ప్రభుత్వం నడుపుతున్నారు. పైగా కాంగ్రెస్ అధినాయకత్వం వద్ద ఆయనకు మంచి పేరు ఉంది. రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ ఆయనకే ఓటు వేస్తున్నారు. దాంతో మరో రెండు సార్లు కాంగ్రెస్ ని అధికారంలోకి తీసుకుని వస్తామని రేవంత్ తన వద్ద ఉన్న అంచనాలతోనే చెబుతున్నారు: తెలంగాణాలో ప్రస్తుతం 119 సీట్లు ఉన్నాయి. అవి ఏకంగా 182 దాకా అవుతాయని రేవంత్ రెడ్డి లెక్క కడుతున్నారు. ఇలా సీట్లు మరో డెబ్బై దాకా పెరిగితే అది కాంగ్రెస్ ప్రభుత్వానికే అనుకూలిస్తుంది అని ఆయన భావిస్తున్నారు. ఎపుడూ అధికారంలో ఉండే పార్టీకే ఈ సీట్ల పెరుగుదల అడ్వాంటేజ్ గా ఉంటుంది అని అంటున్నారు. 2009 లో అసెంబ్లీ సీట్ల పునర్ విభజన వైఎస్సార్ కి బాగా కలిసి వచ్చింది. ఇపుడు కూడా రేవంత్ రెడ్డి అదే జరుగుతుందని భావిస్తున్నారు అంటున్నారు.ఇక రాజకీయంగా చూస్తే వ్యతిరేక ఓట్లు భారీగా వచ్చే ఎన్నికల్లో చీలిపోతాయని కూడా రేవంత్ రెడ్డి అంచనా కడుతున్నారు. విపక్షంలో బీజేపీ బీఆర్ఎస్ రెండూ పోటా పోటీగా ఉన్నాయి. ఈ రెండూ కలిసేది లేదు అని అంటున్నారు. కలుస్తాయని అందుకే పెద్ద ఎత్తున రేవంత్ రెడ్డి ప్రచారం చేస్తున్నారు. ఇదంతా వ్యూహాత్మకం అని అంటున్నారు. ఈ రెండు పార్టీ కలిసినా అప్పటికి అది బూమరాంగ్ అవుతుందని విడిగా పోటీ చేస్తే కనుక కచ్చితంగా యాంటీ ఇంకెంబెన్సీని పంచుకుంటాయని దాంతో మరోసారి గెలుపు బాట కాంగ్రెస్ దే అని రేవంత్ రెడ్డి పూర్తి ధీమాతో ఉన్నారు అని అంటున్నారు.

# రేపు గుడివాడకు సీఎం చంద్రబాబు... స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొనున్న సీఎం

**ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో ముమ్మర సన్నాహాలు...**

**కూటమి నాయకత్వం రంగంలోకిప్రజా ఉత్సవంగా సీఎం పర్యటన నిర్వహిస్తాం:**

**ఎమ్మెల్యే రాము**

**సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ బాలాజీ సమీక్ష...**

**అధికారులకు దిశానిర్దేశంగుడివాడలో భారీ ఏర్పాట్లు...**

**హెలిప్యాడ్, బహిరంగ సభ, కార్యకర్తల సమావేశ వేదికలు ఖరారు**

**గౌతమ్ పాఠశాల వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమం...**

**పలు ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ తనిఖీలు**

**కీలక సూచనలు చేసిన ఎమ్మెల్యే రాము....**

గుడివాడ జులై 17: రేపు గుడివాడకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్నారు. గౌతమ్ పాఠశాల వద్ద జరగనున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించనున్నారు.సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సీఎంఓ అధికారులతో కలిసి గుడివాడ బైపాస్ రోడ్డు, ఇంజనీరింగ్ కళాశాల, ఏఎన్ఆర్ కళాశాలను పరిశీలించారు.కలెక్టర్ బాలాజీ అధ్యక్షతన సమీక్ష సీఎం పర్యటన విజయవంతానికి గుడివాడ మున్సిపల్ కౌన్సిల్ హాల్లో కలెక్టర్ డీకే బాలాజీ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భద్రత, ట్రాఫిక్, ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేస్తూ దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొని పర్యటన ఏర్పాట్లపై కీలక సూచనలు చేశారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం విజయవంతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సీఎం పర్యటనను ప్రజా ఉత్సవంగా నిర్వహిస్తామని, అధికారుల సమన్వయంతో కూటమి నాయకత్వం పూర్తి స్థాయిలో భాగస్వామ్యం అవుతుందని ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు.వేదికలు ఖరారు సీఎం పర్యటనలో భాగంగా ఏఎన్ఆర్ కళాశాలలో హెలిప్యాడ్, ఎన్టీఆర్ స్టేడియంలో బహిరంగ సభ, బైపాస్ రోడ్డులోని యలవర్తి గ్రౌండ్స్ లో టీడీపీ ముఖ్య కార్యకర్తల సమావేశ వేదికలను అధికారులు ఖరారు చేశారు.సీఎం పర్యటనకు గంటల



వ్యవధి ఉండడంతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నాయకత్వంలో టీడీపీ నాయకత్వం ముమ్మర ఏర్పాట్లలో నిమగ్నమైంది.సీఎం పర్యటన ఏర్పాట్లు మరియు సమావేశంలోఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మండల పట్టణ అధ్యక్షులు దానేటి సన్యాసిరావు, పంద్రాజ్ సాంబయ్య, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ కుమార్, గుడివాడ ఆర్డీవో బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ తో పాటు పోలీస్ మరియు పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## క్షణికావేశంలో కుమారుడిని కర్రతో కొట్టి చంపిన తండ్రి...

## మచిలీపట్నం మంగినపూడి బొట్లవానిపాలెంలో దారుణం



మచిలీపట్నం, ఏప్రిల్ 17 :కృష్ణాజిల్లా మచిలీపట్నం మంగినపూడి బొట్లవానిపాలెంలో క్షణికావేశం ఒక కుటుంబంలో విషాదం నింపింది. కుమారుడిపై కోపంతో కర్రతో దాడి చేసిన తండ్రి కొడుకు ప్రాణాలు పోయాయి.పోలీసుల వివరాల ప్రకారం... బొట్లవానిపాలెంకు చెందిన రామ్మోహన్ రావు ఇంట్లో ఆయన కుమారుడు కళ్యాణ చక్రవర్తి(30)తో తల్లికి మధ్య ఏదో విషయంలో గొడవ జరిగింది. దీన్ని సర్దిచెప్పే క్రమంలో రామ్మోహన్ రావు క్షణికావేశానికి గురయ్యారు. ఆవేశంలో కుమారుడు కళ్యాణ చక్రవర్తిపై కర్రతో విచక్షణారహితంగా దాడి చేశారు.దాడిలో కళ్యాణ చక్రవర్తికి తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం అయింది. వెంటనే ఆసుపత్రికి తరలించేలోపే అతను మృతి చెందాడు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి రామ్మోహన్ రావును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనతో బొట్లవానిపాలెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో కళ్యాణోత్సవాలు

## ఎమ్మెల్యే తలసానికి ఆహ్వానం అందించిన అధికారులు

హైదరాబాద్ అమ్మవారి కళ్యాణానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ఈవో వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో కలిసి ఈ నెల 21 వ తేదీన జరిగే అమ్మవారి కళ్యాణం, 22 వ తేదీన నిర్వహించే రథోత్సవానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరంఆలయపండితులుప్రసాదాలుఅందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఇంచార్జి సూపరింటెండెంట్ నాగరాజు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ అమ్మవారి కళ్యాణాన్ని వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుండి లక్షలాది మంది భక్తులు వస్తారని, దీనికి అనుగుణంగా ఏర్పాట్లను చేయాలని చెప్పారు.

# ఏపీలో 12, దేశవ్యాప్తంగా 339 కోవిడ్ కేసులు నమోదు

విజయవాడ ఏపీలో జూన్ 26 నుంచి జులై 16 వరకు 12 కొవిడ్ కేసులు నమోదు అయ్యాయి. కడపలో అత్యధికంగా 8 కొవిడ్ కేసులు నమోదు అయ్యాయి. గుంటూరులో 2.. విశాఖ, కాకినాడలో చెరో 1 కేసు రిపోర్టు అయ్యాయి. కొవిడ్ పాజిటివ్తో నలుగురు మృతి చెందారు. వారికి ముందే తీవ్ర అనారోగ్య సమస్యలు వున్నట్లు వైద్యులు గుర్తించారు. ఐదునమూనాలు జన్యుక్రమ విశ్లేషణ కోసం పూణే ఎన్ఐవీకి పంపించారు. రాష్ట్రంలో కేసులు చెదురుమదురుగా మాత్రమే.. క్లస్టర్లు లేవని సమాచారం. ప్రస్తుతం 3 మంది హోం ఐసోలేషన్లో.. 2 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరో 3 మంది కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. దేశవ్యాప్తంగా జూలై 1 నుంచి 339 కొవిడ్ కేసులు నమోదు అయ్యాయి. దేశంలో అత్యధికంగా కేరళలో 115 కొవిడ్ కేసులు నమోదు అయ్యాయి. కర్ణాటకలో 64.. మహారాష్ట్రలో 43.. తమిళనాడులో 39 కేసులు నమోదు అయ్యాయి.

## నలంద రైల్వే గేట్ తాత్కాలిక మూసివేత

గుడివాడ శుక్రవారం నుంచి ఆదివారం గుడివాడ లోని నలంద రైల్వే గేట్ మరమ్మత్తుల నిమిత్తం తాత్కాలికంగా మూసివేసారు. గుడివాడ పట్టణంలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నందున గుడివాడ మరియు పరిసర ప్రాంతాల వాహనదారులు మీ యొక్క రాకపోకలను ప్రత్యామ్నాయ దారులలో వెళ్లాల్సిందిగా అధికారులు సూచించారు.

మచిలీపట్నం, పామర్రు నుండి భీమవరం మరియు హనుమాన్ జంక్షన్ వైపు వెళ్ళు భారీ వాహనాలు పై తేదీలలో గుడివాడ నుండి వెళ్లకుండా (వయా గుడ్లవల్లేరు) ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లవలసి వుంటుంది. గుడివాడ టౌన్ నుండి మచిలీపట్నం, పామర్రు వెళ్ళవలసిన కార్లు , వాన్ లు ,ఆటో లు ,బస్ స్టాండ్ ,కోతి బొమ్మ సెంటర్ , ముబారక్ సెంటర్, చాపల మార్కెట్ ,పంచవటి కాలనీ,బాపినీడు పెట్రోల్ బంక్ ,భీమవరం గేట్ మీదు గా వెళ్ళవలసి వుంటుంది.

# 18న గుడివాడకు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక

గుడివాడ: రాష్ట్ర ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛ భారత్ కార్య క్రమంలో పాల్గొనేందుకు ఈ నెల 18వ తేదీన గుడి వాడకు వస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. 17న ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులు, జిల్లా కలెక్టర్ గుడివాడ వచ్చి పలుచోట్ల పరిశీలించి వేదికను నిర్ధారిస్తారన్నారు. తెదేపా ముఖ్య కార్యకర్తల సమావేశం కూడా 18న నిర్వహిస్తారన్నారు.

## రాజధాని సీడ్ యాక్సిస్ పనులను పరిశీలించిన మంత్రి నారాయణ

అమరావతి రాజధాని సీడ్ యాక్సిస్ రోడ్డును పాత గుంటూరు హైవే కి అనుసంధానించే పనులను మంత్రి నారాయణ శుక్రవారం పరిశీలించారు. సీడ్ యాక్సిస్ రోడ్డులో భాగంగా రెండు స్టీల్ బ్రిడ్జి లు నిర్మిస్తుంది. బకింగ్ హామ్ కెనాల్, కొండవీటి వాగులపై స్టీల్ బ్రిడ్జి ల నిర్మాణం దాదాపు పూర్తి కావస్తుంది. విజయవాడ,మంగళగిరి నుంచి నేరుగా అమరావతి కి ప్రవేశించేలా సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణం పూర్తి కావస్తుంది. స్టీల్ బ్రిడ్జి పనులు పూర్తయ్యేలోపు పెండింగ్ రోడ్డు పనులు పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు ఇచ్చారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లింపు

## డెంగ్యూ, మలేరియా నియంత్రణకు రాజీవ్‌నగర్ గ్రామపంచాయతీ ప్రత్యేక చర్యలు



తాండూర్ మండలం రాజీవ్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కాలువలు, మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లింపు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని సర్పంచ్ మామిడాల లలిత–రాజేశం, ఉపసర్పంచ్ కాపర్తి సుభాష్, పంచాయతీ కార్యదర్శి రామాదేవి, వార్డు సభ్యులు పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటూ గ్రామపంచాయతీకి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రకృతి వ్యవసాయంతో భూమి ఆరోగ్యం..

## ప్రత్యామ్నాయ పంటలతో రైతులకు భరోసా

**ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో తక్కువ నీటి అవసరమయ్యే పంటలు సాగు చేయాలని వ్యవసాయ అధికారుల సూచన**



తాండూర్ మండలం గోపాల్‌నగర్ గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ సాగు విధానాలు మరియు ఎల్ నినో ప్రభావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి సుష్మా మాట్లాడుతూ, రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లడం ద్వారా భూమి సారవంతత పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని తెలిపారు.ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగయ్యే పత్తి, కంది, పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్, గ్రామ సర్పంచ్ నర్సయ్య, రైతులు పాల్గొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన పొందారు.

## సిబిఐటి పరీక్షల అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

## పిడిఎస్ యూ డిమాండ్

హైదరాబాద్ సిబిఐటి పరీక్షల విభాగంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి అవకతవకలకు పాల్పడిన వారిపై ఓయూ విసి ప్రొఫెసర్ కుమార్ చర్యలు తీసుకోవాలని పిడిఎస్యు విజృంభన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద పిడిఎస్యు విజృంభణ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ మూడు నెలల క్రితం జరిగిన అవినీతి అక్రమాల నేపథ్యంలో సిబిఐటి లో ఉన్న ఇద్దరు ప్రొఫెసర్లు కొట్లాడుకోవడం జరిగిందన్నారు. ఇంత జరుగుతున్న ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్, రిజిస్ట్రార్ నరేష్ రెడ్డి ఈ విషయంపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ఏదో ఒక కమిటీ వేసి విచారణ జరుగుతున్న నేపథ్యంలో కంట్రోలర్ శశికాంత్ ను సైతం బాధ్యతలు నుంచి తప్పించడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. విచారణలో ఎటువంటి పురోగతి లేదని దీనిపై వీసీ స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడిన నలుగురు విద్యార్థుల పేర్లను విడుదల చేయడం జరుగుతుందని తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

# ఆలయంలో హుండీలు చోరీ

హైదరాబాద్ ఓల్డ్ బోయిన్ పల్లి లో అత్యంత ప్రసిద్ధిగాంచిన శ్రీ దేవి నల్ల పోచమ్మ దేవాలయంలో 2 హుండీలు చోరీకి గురయ్యాయి. స్వామివారి ఆలయంలోని హుండీని గుర్తు తెలియని వ్యక్తి వేకువ జామున తీసుకువెళ్లాడు. హుండీలోని డబ్బు తీసుకొని మరల అక్కడే పెట్టేసాడు. దేవాలయంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో, ఆలయం చుట్టుపక్కల సీసీ కెమెరాలలో నమోదైన దృశ్యాల ఆధారంగా బోయిన్ పల్లి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. సుమారుగా 20 వేల రూపాయలు అపహరణకు గురయ్యాయని, ఆలయ కమిటీ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు మహిపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... దేవుడు అంటే భక్తి ఉండాలి కానీ, ఇలా ఆలయాలలో హుండీలను చోరీ చేయడానికి వారు తీవ్రంగా ఖండించారు. ఆలయాలు ఇలాంటి చోరీలకు పాల్పడిన దుండగులను కఠినమైన శిక్ష పడే విధంగా పోలీసులు చొరవ చూపాలని కోరారు.

## తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం..

## ఇద్దరు యువకులు మృతి..






మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం, జూలై 16వ తేదీ రాత్రి సుమారు 11:50 గంటల సమయంలో దిల్‌కుష్‌నగర్ ఐడీపీఎల్‌కు చెందిన సొహైల్ (18), కుత్బుల్లాపూర్‌కు చెందిన సుమిత్ గైక్వాడ్ (19) మోటార్‌సైకిల్ (నంబర్: ఝ08 ఉజ 9850)పై మేడ్చల్ నుంచి కొంపల్లి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో కండ్లకోయ ఔటర్ రింగ్ రోడ్ (ఞఖీఖీ) అండర్‌బ్రిడ్జి వద్దకు చేరుకోగానే గుర్తు తెలియని వాహనం వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఢీకొట్టిన తీవ్రతకు ఇద్దరూ రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన గుర్తు తెలియని వాహనం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ప్రేమ వ్యవహారమే కారణం

## కత్తితో దాడి చేసిన యువకుల అరెస్టు



ఆళ్లగడ్డ పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో సమీర్ అనే వ్యక్తి పై కత్తితో దాడి చేసిన నలుగురు యువకులను అరెస్టు చేసినట్లు డిఎస్పి శ్రీనివాసరావు తెలిపారు శుక్రవారం ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడిస్తూ ఈనెల 14వ తేదీ రాత్రి 9:30 గంటల సమయంలో సమీర్ అనే వ్యక్తిపై నలుగురు వ్యక్తులు కత్తులతో దాడి చేసి పరారయ్యారు ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టడం జరిగింది ఆళ్లగడ్డ పట్టణ శివారులోని జాతీయ రహదారిపై ఉన్న ఏవీ గోడౌన్ దగ్గర దోష హౌస్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను పట్టణ సీఐ నాగరాజారావు ఎస్సై చిన్న వీరయ్య మరియు సిబ్బంది వారందరినీ అదుపులోకి తీసుకున్నారన్నారు పోలీసుల విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించారని అరెస్టు అయిన వారిలో మునగాల పెద్ద ఏల్లాలు కురుబ వెంకట సుధీర్ తలారి నరేంద్ర మరియు దూదేకుల హుస్సేన్ బాబు ఉన్నారని నిందితుల దగ్గర నుండి రెండు మోటార్ బైకులు ఒక కత్తి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు ప్రేమ వ్యవహారమే ఈ దాడికి ప్రాథమిక కారణంగా గుర్తించినట్టు డిఎస్పి శ్రీనివాసరావు పేర్కొన్నారు నిందితులను కోర్టులో హాజరు పరచనున్నట్లు ఆయన వెల్లడించారు.

## కేజీబీవీ విద్యార్థినులకు ఉచిత కంటి పరీక్షలు

ఆత్మకూరు, జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం) పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు డాక్టర్ షేక్షావలి విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలోని మొత్తం 280 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 41 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. కంటి అద్దాలు అవసరమైన విద్యార్థినులకు ఉచిత అద్దాలు అందజేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షేక్షావలి మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఇతర డిజిటల్ పరికరాలను ఎక్కువసేపు ఉపయోగించకుండా ఉండాలని సూచించారు. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఆకుకూరలు, క్యారెట్, గుడ్లు, పండ్లు వంటి పోషకాహారం తీసుకోవాలని, చదివేటప్పుడు తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలని, క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శ్యామల వైద్య సిబ్బంది కృష్ణవేణి ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సభ నడిపించి తీరుతాం

# బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్ బీఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యం లో కేటీఆర్ ముఖ్య అతిథిగా రేపు సరూర్ నగర్ స్టేడియం లో జరపనున్న యువ సంగ్రామ సదస్సు కి ప్రభుత్వం ఇనుమతులు ఇవ్వకపోవడం తో పార్టీ నాయకులు హై కోర్టును ఆశ్రయించారు. దీనిపై సరూర్ నగర్ సభ స్థలివద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు మాట్లాడుతూ జూన్ 30 న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కి సభ పెర్మిషన్ కి దరఖాస్తు చేయటం జరిగింది. స్పోర్ట్ అథారిటీ కి కూడా కలెక్టర్ కు లేఖ రాయటం జరిగింది. స్పోర్ట్ అథారిటీ వారు జూలై 8 న మల్కాజ్ గిరి పోలీస్ కమిషనర్ కి లేఖ రాయటం జరిగింది. సిపి కార్యాలయం నుండి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి కి ఫోన్ చేసి మళ్లీ దరఖాస్తు చేయమన్నారు. జూలై 15 న మళ్ళీ దరఖాస్తు చేయటం జరిగింది. సిసి కెమెరాలు పెట్టాలని ఒకసారి చెప్పటం జరిగింది. మరో రోజు టాయిలెట్స్ పెట్టాలని చెప్పారు..అవికూడా పెట్టాము.. మళ్ళీ ఒక్కరోజు ఫైర్ పెర్మిషన్ కావాలన్నారు. పార్కింగ్ సరిపోదని చెప్పారు. సర్వే నెంబర్ 9/జీ లో 5 ఎకరాలు పార్కింగ్ కోసం తీసుకోవడం జరిగింది. సీపి తో మాట్లాడితే పర్మిషన్ ఇస్తామన్నారు. ఈ రోజు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయటం లేదు. గ్రౌండ్ కి కూడా డీడీ కట్టడం జరిగింది. మాకున్న సమాచారం ముఖ్యమంత్రి కార్యాలయం నుండి సిపి కి పర్మిషన్ ఇవ్వకూడదని చెప్పారని సమాచారమని అన్నారు.

ఇక్కడ ప్రియాంక గాంధీని పిలిచి సభ పెట్టుకున్నపడు గతం లో మేము పెర్మిషన్ ఇచ్చాము. నిరుద్యోగ యువత వారి హక్కుల కోసం పోరాటం చేస్తుంటే భయపడుతున్నారు. మీరు ప్రతిపక్షం లో ఉన్నపుడు ఎక్కడ సభ పెట్టిన పెర్మిషన్ ఇచ్చాము. డీజీపీ గతం లో పలు కమిషనరేట్ లో కమిషనర్ గా చేసినప్పుడు చాలా పెర్మిషన్ లో ఇచ్చారూ ఇప్పుడు మాకు ఎందుకు ఇవ్వట్లేరు. ముఖ్య మంత్రి కార్యాలయం నుండి వచ్చిన ఫోన్ కాల్ కారణంగా మీరు పెర్మషన్ ఇవ్వడం లేదు దీనికి సమాధానం చెప్పండి మీరు పర్మిషన్ ఇవ్వకపోతే మేము న్యాయస్థానం ద్వారా పెర్మిషన్ తెచ్చుకుని సభ నడుపుతం. మాకు న్యాయవ్యస్థ పైన నమ్మకం ఉంది. స్కాలర్షిప్ ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారు.. సరూర్ నగర్ వేదిక నుండి రేపు జరగబోయే సభను కాంగ్రెస్ ప్రభుత్వ0 ఆపలేదు..ఏదేమైనా సభ నడిపి తీరుతాం విజయవంతం చేస్తాం. విద్యార్దులు అందరూ కూడా పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరుతున్నమని అన్నారు.

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి మాట్లాడుతూ జూన్ 30 దరఖాస్తు చేస్తే 18 రోజులు అయినా ఇవ్వలేదు. 18 రోజుల్లో 6 రోజుల్లో 6 కోరికలు కోరారు. రేపు ఉదయం సభ ఉండగా ఇప్పటికీ పెర్మిషన్ ఇవ్వలేదు. ఇంటలిజెన్స్ సమాచారం ప్రకారం పెద్ద ఎత్తున విద్యార్థులు వచ్చే అవకాశం ఉండగా కావాలని సభకి పెర్మిషన్ ఇవ్వడం లేదు. కావాలని డిగ్రీ పరీక్షలు సభ జరిగే రోజు 18 కి పోస్ట్ పోన్ చేశారు. ఒక సంవత్సరం లో 2 లక్షల ఉద్యోగాలను ఇస్తామని రాహుల్ గాంధీ చెప్పారు...ప్రియాంక గాంధీ చెప్పారు ఇదే సరూర్ నగర్ స్టేడియం లో. మీ అధికారిక వెబ్ సైట్ లో 16 వేలు ఉద్యోగాలు ఇచ్చామని పెట్టారు నిరుద్యోగ యువతని అనేక రకాలుగా మభ్యపెట్టినందుకు విద్యార్దులు కచ్చితంగా ముఖ్యమంత్రికి బుద్ధి చెప్తారు. దిల్సుఖ్ నగర్ లో విద్యార్ధులను అరెస్ట్ చేసి నాగోల్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. తప్పక ఈ సభ చేసి తీరుతాం. పార్టీ విద్యార్ది లోకానికి అండగా ఉంటది. లైవ్ లో మల్కాజ్ గిరి సిపి కి ఫోన్ చేస్తే ఇప్పుడే మీ ఫైల్ టేబుల్ పైకి వచ్చింది చూస్తామని చెప్పారనిఅన్నారు.

## గౌతంగూడలో అంగన్వాడీ కేంద్రం మంజూరు

## కోసం కుటుంబాల సర్వే పరిశీలన



చోర్ పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గౌతంగూడ గ్రామంలో 56 ఆదివాసీ గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామంలో ఇప్పటివరకు అంగన్వాడీ కేంద్రం లేకపోవడంతో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు ప్రభుత్వ సంక్షేమ సేవలకు దూరమవుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు గౌతంగూడ గ్రామంలో అంగన్వాడీ కేంద్రం మంజూరు ప్రక్రియలో భాగంగా ఈరోజు ఎఅఆ సూపర్‌వైజర్ (ఉ-ఎ) ఆధ్వర్యంలో కుటుంబాల సర్వే మరియు స్థల పరిశీలన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వీరబాబు గారు, గ్రామ సర్పంచ్ మార్సకోలా అనసూయ జూగాదిరావు, ఉప సర్పంచ్ ఆత్రం నీలకంఠరావు, గ్రామ పటేల్, గ్రామ ప్రజాప్రతినిధులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. గౌతంగూడ గ్రామానికి అంగన్వాడీ కేంద్రం త్వరితగతిన మంజూరై, గ్రామంలోని చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రావాలని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆకట్టుకున్న నగల ప్రదర్శన

వారాహి జ్యువెల్స్ మూడో వార్షికోత్సవం సందర్భంగా జూబ్లీహిల్స్ లోని వారాహి షోరూంలో ప్రత్యేక నగల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను మల్లారెడ్డి విద్యాపీఠం వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రీతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సంప్రదాయ కళాత్మకతతో రూపొందించిన డైమండ్, కుందన్, పోల్కి, నక్షి, టెంపుల్ జ్యువెలరీతో పాటు డిజైనరీ జ్యువెలరీని ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచుతున్నట్లు నిర్వాహకులు సందీప్ కరణం తెలిపారు. నాలుగు రోజుల పాటు ఈ ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు.

38తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు హాజరు

## హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై మరో రోడ్డు ప్రమాదం



మేడ్చల్‌కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డుపై గొర్రెలను తరలిస్తూ, రోడ్డు పక్కన వాహనం ఆపి రాములు(60), రషీద్(40) అనే ఇద్దరు మెదక్ జిల్లా వాసులు నిద్రపోతున్నారు. ఆదే వీరి వాహనాన్ని గుర్తుతెలియని వాహనం వెనుకనుండి ఢీకొట్టి.. రోడ్డు పక్కన పడుకున్న వీరి మీద నుండి వెళ్లిపోయింది. ప్రమాదంలో రషీద్ (40), రాములు (60) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# వర్షపు నీటి సంరక్షణకు ప్రతిజ్ఞ




**జహీరాబాద్, జూలై 17 ప్రజాబలం ప్రతినిధి:** జల్ సంచయ్--జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న 'క్యాచ్ ద రైన్' ప్రచార కార్యక్రమంలో శుక్రవారం జహీరాబాద్‌లో వర్షపు నీటి సంరక్షణ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీవో దేవుజా ప్రతిజ్ఞ చేయించగా, జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్ పాల్గొన్నారు. రెవెన్యూ శాఖ, జహీరాబాద్ మున్సిపాలిటీకి చెందిన అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని వర్షపు నీటిని సంరక్షించడం, వర్షపు నీటి నిల్వ విధానాలను ప్రోత్సహించడం, సుస్థిర జల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించాలంటే ప్రతి నీటి బొట్టును సంరక్షించడం అత్యంత అవసరమని తెలిపారు. ప్రతి ఇంటిలో, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసి, ప్రజల భాగస్వామ్యంతో నీటి వనరులను కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం చివరలో జల్ సంచయ్--జన్ భాగీదారి -- క్యాచ్ ద రైన్ కార్యక్రమ లక్ష్యాల సాధనకు కృషి చేస్తామని పాల్గొన్న వారంతా ప్రతిజ్ఞ చేశారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీలు రేణుకా చౌదరి, రామసహాయం రఘురాం రెడ్డి



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై17 ప్రజాబలం:** అనారోగ్యంతో బాధపడుతూ ప్రయివేట్, కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్స పొందిన వలువురు పేదలకు ముఖ్యమంత్రిసహాయ నిధి ద్వారా మంజురైన చెక్కులను రాజ్యసభ సభ్యురాలు, రేణుకా చౌదరి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పంపిణీ చేశారు. చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా క్యాంపు కార్యాలయంలో ఈరోజు సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇప్పటివరకు కొత్తగూడెం నియోజకవర్గంలో ఈ రెండున్నర సంవత్సర కాలంలో 269 పై చిలుకు మందికి చెక్కుల రూపంలో అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవి ప్రసన్న, దేవి ప్రసన్న, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి, కొత్వాల శ్రీనివార్ రావు, మాజీ జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్ర శేఖర్ రావు, జిల్లా అదిరికార ప్రతినిధి వై శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడేట్ జానీ పాషా, మంద హనుమంత రావు, కొదుమూరి శ్రీనివాస్ రావు, జిల్లా జనరల్ సెక్రటరీ లు ఏం పెద్ద బాబు, నాగార్జున, సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, ఐఎన్ టీఎంసీ రజాక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, పట్టణ, మండల కాగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ యాదవ్, దేవగడ్ల ప్రసాద్, జేమ్స్ సునీల్, భువన సుందర్ రెడ్డి, చింతలపూడి రాజ శేఖర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గడ్డల రమేష్, కార్పొరేటర్లు, సర్పంచ్ లు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఏనుగుల అర్జున్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య




**సత్తుపల్లి ప్రజాబలం ప్రతినిధి జూలై 17:** ఎల్ నినో ప్రభావంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు ఆలస్యంగా కురవడం, మధ్య మధ్యలో దీర్ఘకాలిక వర్ష విరామాలు, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య సూచించారు.

సత్తుపల్లి మండలంలోని పంటలను పరిశీలించిన అనంతరం కిష్టారం సొసైటీలో నిర్వహించిన ప్రత్యామ్నాయ పంటల సాగు -- పంట కుంటల నిర్మాణం అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.




ఎల్ నినో ప్రభావం వల్ల వరి, పత్తి, మొక్కజొన్న, కంది, పెసర, మినుము వంటి ఖరీఫ్ పంటలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధిక నీటి అవసరం ఉన్న వరి సాగును తగ్గించి, ప్రత్యామ్నాయంగా పెసర, మినుము, జొన్న, సజ్జ, రాగులు, నువ్వులు, ఉలవలు వంటి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ముఖ్యంగా చెరువుల కింద, బోర్‌బావుల ఆధారంగా వరి సాగు చేయకుండా ఉండాలని, అధిక నీటి వినియోగం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన స్వల్పకాలిక, కరవును తట్టుకునే విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలని, ప్రతి రైతు తన పొలంలో నీటి సంరక్షణ కోసం పంట కుంటలు నిర్మించుకోవాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలు, వ్యవసాయ శాఖ సలహాలను ఎప్పటికప్పుడు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో పంటల నిర్వహణ చేపడితే దిగుబడి నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు వి. శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయ అధికారి డి.ఎన్.కె. శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తరణ అధికారి డి. నరేష్, కిష్టారం పీఏసీఎస్ చైర్మన్ చి. లక్ష్మీనారాయణ, సర్పంచ్ నరుకుళ్ల రాజేశ్వరి అప్పారావు, సొసైటీ సీఈఓ, సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటును కాపాడే బాధ్యత కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ లదే.

## సర్ పై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి..

## పండితాపురం గ్రామంలో సర్ పై అవగాహన సదస్సులో పాల్గొన్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు.

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై17 ప్రజాబలం:** ఖమ్మం జిల్లా ఇల్లందు నియోజకవర్గ కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో సర్ పై బీఎల్ఏ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కోసం నిర్వహించిన ఓటర్ల సవరణ అవగాహన సదస్సులో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్లు నమోదు తొలగింపులపై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.. సర్ కార్యక్రమంలో ఓటర్ జాబితా సవరణలు కొత్త ఓటర్ల నమోదు మార్పులు చేర్పులు తొలగింపులు తదితర అంశాలపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.. కాంగ్రెస్ కు లౌకికవాదానికి అనుకూలంగా ఉండే ఓట్లు తొలగించేందుకు బిజెపి కుట్ర చేస్తుందని విమర్శించారు.. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.. బీఎల్ఏ లు కీలకంగా వ్యవహరించాలన్నారు.. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడటం మన బాధ్యత అని అన్నారు... ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, పండితాపురం సర్పంచ్ అనురాధ, మద్దినేని రమేష్, ఉపసర్పంచ్ మల్లికార్జున్, మండలం బిసి సెల్ అధ్యక్షులు చల్లమల్లయ్య, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు, జనరల్ సెక్రటరీ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు...



# ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కూచిపూడి నృత్య వర్క్‌షాప్




వేములవాడ, జూలై 17: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కూచిపూడి నృత్య వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ప్రముఖ కూచిపూడి కళాకారిణి రాజశ్రీ హెల్ల విద్యార్థుల ఎదుట అద్భుతమైన నృత్య ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులకు కూచిపూడి నృత్యంలోని ప్రాథమిక అంశాలపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా రాజశ్రీ హెల్ల తన నృత్య ప్రదర్శనలో నవరసాలు, హావభావాలను అద్భుతంగా ఆవిష్కరించారు.




ముఖ్యంగా తాంబూలం (పళ్లెం)పై చేసిన నృత్యం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుని చప్పట్లతో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారత్నం మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలపైనా ఆసక్తి పెంపొందించుకుని తమ ప్రతిభను వెలికితీయాలని సూచించారు. ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు.

అనంతరం కూచిపూడి కళాకారిణి రాజశ్రీ హెల్లను ఉపాధ్యాయ బృందం శాలువాతో ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేశం, రవీందర్, సలాం, కోటేశ్వర్, శ్రీలత, స్వరూప, రమాదేవి, చంద్రమౌళి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# మంథనిలో న్యాక్ స్కిల్ డెవలెప్ మెంట్ సెంటర్...

## భవన నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు

## సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డికి కృతజ్ఞతలు: మంత్రి శ్రీధర్ బాబు



**పెద్దపల్లి, జూలై 17, ప్రజాబలం ప్రతినిధి :** జిల్లా మంథనిలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (ఎన్ఏసీ) స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ కేంద్ర భవన నిర్మాణానికి రూ. 20 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు రవాణా, రోడ్లు, భవనాల (టీఆర్‌డబీ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నిర్మాణ రంగానికి అవసరమైన అత్యుత్తమ మానవ వనరుల్ని తీర్చిదిద్దడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషించనుంది. నిర్మాణ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను యువత అందిపుచ్చుకునేలా అంతర్జాతీయ స్థాయి నైపుణ్య శిక్షణ ఇక్కడ లభించనుంది. స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సుల ద్వారా శిక్షణార్థులకు స్వయం ఉపాధితో పాటు ప్రముఖ దేశీయ, అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక న్యాక్ సెంటర్ ను మంథనికి కేటాయించడంపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నిర్మాణ రంగంలో ఉత్తర తెలంగాణ యువతకు నాణ్యమైన నైపుణ్య శిక్షణను అందించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలను కల్పించేలా ఈ కేంద్రం వారధిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# విశ్వమాంగల్య సభ దక్షిణ భారత ప్రబోధన సమావేశం జూలై 25--26 తేదీలలో భాగ్యనగర్ (హైదరాబాద్)లో నిర్వహణ

### రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పూజనీయ సర్‌సంఘచాలక్ డా. మోహన్ భాగవత్ జీ దేశంలోని ప్రబుద్ధ మాతృశక్తితో ప్రత్యేక సంభాషణ నిర్వహించనున్నారు

**హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ప్రజాబలం ప్రతినిధి:** భాగ్యనగర్ (హైదరాబాద్):విశ్వమాంగల్య సభ జాతీయ సంస్థా మంత్రి లివృషాలి జోషిలి ఈరోజు నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతూ, విశ్వమాంగల్య సభ గత 16 సంవత్సరాలుగా మాతృశక్తి సాధికారత, కుటుంబ మరియు సామాజిక చైతన్య రంగాల్లో సేవలందిస్తున్న దేశవ్యాప్త సంస్థ అని తెలిపారు. సంస్థ యొక్క మూల ధ్యేయవాక్యం లి"న మాతుః పర దైవతమ్", అంటే లి"తల్లికంటే గొప్ప దైవం మరొకటి లేదు" అని ఆమె పేర్కొన్నారు.

ఇది మహిళల మధ్య సామాజిక, సాంస్కృతిక మరియు వైచారిక రంగాల్లో కార్యాచరణ నిర్వహించే స్వతంత్ర సంస్థ. విశ్వమాంగల్య సభ మాతృశక్తితో కలిసి పనిచేస్తూ సమాజ జీవనంలో సానుకూల మార్పు తీసుకురావడానికి కృషి చేస్తోంది.

ప్రస్తుతం దేశంలోని లి33 ప్రాంతాల్లోలి సంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని ఆమె తెలిపారు. ఇటీవల భాగ్యనగర్ (హైదరాబాద్) సహా లి23 ప్రాంతాల్లోలి మహిళా అధివేశనాలు నిర్వహించబడ్డాయి. ఆ సంభాషణల ఆధారంగా రాబోయే సంవత్సరాల్లో లి"యుగానుకూల మాతృత్వం (Contemporary Motherhood) "లి అనే అంశంపై వివిధ కార్యక్రమాల ద్వారా పని చేయాలని సంస్థ నిర్ణయించింది.

ఈ ఏడాది సమావేశం ప్రత్యేకతలి వృషాలి జోషి తెలిపారు కి ఈ సంవత్సరం తొలిసారిగా విశ్వమాంగల్య సభ, లిడా. మోహన్ భాగవత్ జీలి సమక్షంలో మాతృత్వం అనే ఈ అత్యంత ముఖ్యమైన అంశంపై దేశంలోని ప్రబుద్ధ మహిళల కోసం ప్రత్యేక




ఉపన్యాసం మరియు చర్చను నిర్వహించాలని నిర్ణయించింది. ఆయన ప్రత్యేక ఉపన్యాసం లిహైదరాబాద్‌లోని కొమరం భీమ్ ఆదివాసి భవన్, రోడ్ నెం. 10, బంజారా హిల్స్‌లిలో జరుగుతుంది.

విశ్వమాంగల్య సభ లిదక్షిణ భారత ప్రబోధన సమావేశంలి జూలై లి25 మరియు 26లి తేదీలలో హైదరాబాద్‌లోని లిచీ×-మీవీజు (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్), యూసుఫ్‌గూడాలిలో నిర్వహించబడుతుంది.

భాగ్యనగర్‌లో జరిగే ఈ సమావేశానికి దక్షిణ భారతంలోని వివిధ ప్రాంతాలు మరియు ప్రాంతాల నుండి సుమారు లి200 మంది ప్రతినిధి మహిళలులి పాల్గొంటారు. వీరిలో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, గోవా, తమిళనాడు, కేరళ మరియు ఇతర రాష్ట్రాల మాతృశక్తి ప్రతినిధులు ఉంటారు.

జూలై 26న కొమరం భీమ్ ఆదివాసి భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం

జూలై 26 సాయంత్రం 4:00 గంటలకు, లిలికొమరం భీమ్ ఆదివాసి భవన్, రోడ్ నెం. 10, బంజారా హిల్స్‌లిలో దేశంలోని ప్రబుద్ధ మాతృశక్తితో ప్రత్యేక సంభాషణ కార్యక్రమం నిర్వహించబడుతుంది.

ఈ కార్యక్రమంలో లిపూజనీయ సర్‌సంఘచాలక్ డా. మోహన్ భాగవత్ జీ, దేశంలోని ప్రబుద్ధ మాతృశక్తితో కలిసి లి"యుగానుకూల మాతృత్వం"లి అనే అంశంపై విస్తృతంగా సంభాషిస్తారు. ఈ సమావేశంలో లిలిప్రశ్నోత్తరాల కార్యక్రమంలి కూడా ప్రత్యేకంగా నిర్వహించబడుతుంది.

కొమరం భీమ్ ఆదివాసి భవన్‌లో నిర్వహించబడే ఈ ప్రత్యేక కార్యక్రమానికి హైదరాబాద్‌తో పాటు దక్షిణ భారతంలోని వివిధ రాష్ట్రాల నుండి సుమారు లి1300 నుండి 1500 మంది మహిళలులి హాజరవుతారని అంచనా.

విశ్వమాంగల్య సభ తరఫున లివృషాలి జోషిలి, జూలై 26న కొమరం భీమ్ ఆదివాసి భవన్‌లో నిర్వహించబడే ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని కవర్ చేయడానికి మీడియా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

RSVP : Udayashri Ji Patel, Telangana Pranta Samparka Pramukh, Vishwamangalya Sabha - 09989435564

# పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

## పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో జహీరాబాద్‌లో భారీ ర్యాలీ, ధర్నా



**జహీరాబాద్, జూలై 17 ప్రజా బలం ప్రతినిధి:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.10,500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జహీరాబాద్‌లో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు.స్థానిక ఆచార్య డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీలో వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొని ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు.




అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని చెబుతున్నప్పటికీ, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను విద్యకు దూరం చేసే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, అనిల్, డివిజన్ కార్యదర్శి గోపాల్, నాయకులు అనిరుద్, క్రాంతికుమార్, పౌల్‌రాజ్, సంజన, సునీల్, కరణ్, మిరాజ్, మల్లేష్, పవన్, ఈశ్వర్, వరలక్ష్మి, శిరీష, మహాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## తహశీల్దార్ జగదీష్,



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూలై 17**ఏటూరునాగారం: మండల కేంద్రంలోకేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ ఐ ఆర్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వారి ఓటు హక్కును కాపాడుకోవాలని తహశీల్దార్ జగదీష్, సర్పంచ్ కాకులమర్రి శ్రీలత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని 4 వార్డులో పోలింగ్ బూత్‌లలో వారిగా ఎస్ఐఆర్‌లను పరిశీలించి ఓటర్ల నుంచి ఫామ్స్‌ను స్వీకరించారు.

డెత్, డబుల్ ఉన్న ఓటర్ల తొలగింపు చేయడం జరుగుతుందన్నారు. మీ వద్దకు వచ్చే బీఎల్వోలు, బీఎల్ఏ లు మీ అనుమానాలను నివృత్తి చేసి ఫామ్స్‌ను ఏ విధంగా నింపాలి ఎప్పుడూ అందజేయాలి అనేది వివరిస్తారని తెలిపారు. ఈ ఎస్ ఐ ఆర్ ఫామ్ స్వీకరణ ఆగస్టు 3 వరకు పొడిగించడం జరిగిందని వారు తెలిపారు. కానీ అన్ని వర్గాల ప్రజలు ఈనెల 20 తేదీ వరకు అందజేయాలని, ఆన్‌లైన్ చేసే ప్రక్రియను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఫామ్స్ రాకున్నా, ఇంకా ఎలాంటి సమాచారం కావాలన్న బీఎల్ఓలు, రెవెన్యూ కార్యాలయంను సంప్రదించాలని కోరారు. బీఎల్ఓలు ఇప్పటికే దాదాపుగా అన్ని ప్రాంతాలకు కవర్ చేయడం జరిగిందని, ఇంకా ఎవరికైనా ఫామ్స్ రాకపోతే గ్రామ పంచాయతీ, రెవెన్యూ సిబ్బందిని సంప్రదించాలని వారు తెలిపారు.

# శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా హరితోత్సవం

## విద్యార్థులతో కలిసి మొక్కలు నాటిన ఎమ్మెల్యే మాణిక్‌రావు




**జహీరాబాద్, జూలై 17 ప్రజాబలం ప్రతినిధి:** పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం హరితోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల మొక్కలను తీసుకువచ్చి, వాటి ప్రాధాన్యతను వివరిస్తూ "ఒక్కొక్కరం ఒక మొక్క నాటుదాం – – పచ్చని తెలంగాణను నిర్మిద్దాం", "వృక్షో రక్షతి రక్షితః" వంటి నినాదాలతో పట్టణ పురవీధుల్లో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.



అనంతరం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మండల విద్యాధికారి మాన్యయ్య, స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఏజీఎం వీర రహిమాన్ పాల్గొని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు సూచించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ వీనదరి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. నేడు నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.



హరితోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో చిత్రలేఖనం, వ్యాసరచన, ప్రసంగ పోటీలు నిర్వహించి విజేతలకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై రూపొందించిన చిత్రాలు, సందేశాలు అందరినీ ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని హరితహారాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం ముగింపులో ప్రతి విద్యార్థికి ఒక మొక్కను అందించి, ఇంటి వద్ద నాటి సంరక్షించాలని నిర్వాహకులు సూచించారు.

# సర్పంచ్ భర్త దౌర్జన్యం

## విద్యుత్ స్తంభాల వివాదం

### విద్యుత్ స్తంభాన్ని పక్కకు వేయాలని కోరిన ఇంటి యజమానిపై కర్రతో దాడి

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జులై 17 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** పుల్కల్ మండలం శివంపేట గ్రామంలో, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు వివాదం ఉద్రిక్తకు దారి తీసింది, ఇంటి ముందు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాన్ని కొద్దిగా పక్కకు మార్చాలని కోరిన వ్యక్తిపై గ్రామ సర్పంచి బర్తతో పాటు మరో వ్యక్తి దాడికి పాల్పడ్డారు అన్న వార్తలు వెలుగుచూశాయి, ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది, బాధితుడు కుమ్మరి రాజు, ఫిర్యాదు మేరకు తన ఇంటి ముందు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, వాటిని కొద్దిగా పక్కకు వేయాలని కోరిన సమయంలో వాగ్ వివాదం చోటుచేసుకుందని తెలిపారు, అనంతరం



సర్పంచ్ భర్త కొత్తగాడి మల్లికార్జున గౌడ్, చాకలి అశోక్, అక్కడికి చేరుకొని, తనతో గర్షణకు దిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు, ఫిర్యాదు ప్రకారం చాకలి అశోక్,తనను పట్టుకోగా కొత్తగాడి మల్లికార్జున గౌడ్, కర్రతో దాడి చేశారని, ఈ ఘటనలో ఎడమ చేతికి గాయమై పాత గాయం మళ్ళీ తెరుచుకుని రక్తసావం జరిగిందని బాధితుడు పేర్కొన్నారు,ఈఘటనపై పుల్కల్ పోలీసులు బి ఎన్ ఎస్ సెక్షన్ 118 (1)తీ/ష3 (5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు, ఈఘటనకుసంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడి కానున్నాయి..

# అంబులెన్స్ వెళ్ళడానికి వీలు లేని అడవి ప్రాంతాలలో అడవి బిడ్డల జీవనాలు

# కష్టం వచ్చిందంటే కాపాడే వారెవరు

# అయిన ప్రాణాలు కాపాడిన అంబులెన్స్ సేవకులు.





**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 17** ప్రభుత్వాలు మారిన అడవి ప్రాంతాలలో జీవం సాధిస్తుంది గుత్తి కోయ గిరిజన ప్రాంతాల జీవితాలలో మార్పు రావడం లేదు చత్తీస్గడ్ నుంచి వలస వచ్చిన గుత్తి కోయ నివాసులు ములుగు జిల్లా అడివి ప్రాంతాలలో నివాసాలు ఏర్పాటు చేసుకొని పోడు సైతం సాగు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు ముఖ్యంగా వీరి జీవన విధానం ఊరికి దూరంగా ఉంటూ ప్రభుత్వ ఆసుపత్రికి ఆఫీసులకి పోలీస్ స్టేషన్ కి సంబంధాలు లేకుండా సొంతంగా ఒక్క గ్రామాన్ని అడవి ప్రాంతంలో ఏర్పాటు చేసుకొని అడవి భూములను పోడు చేసి సాగు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు దీనితో వారి జీవన విధానం వారి మధ్యనే ఆ గుంపు మధ్యనే సహజీవనం జరుగుతుంది వారికి కావలసిన పని ఉన్నప్పుడు మాత్రమే మైదాన ప్రాంతాలకు చేరి వారి అవసరాలను తీర్చుకుంటూ మరల అడవి ప్రాంతంలోకి వెళుతూ ఉంటారు అడవి ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు వీరు నివసిస్తున్న నివాసాల వద్దకు ప్రభుత్వాలు రోడ్లు గాని కరెంటు గాని ఏర్పాటు చేయలేని పరిస్థితి అయినప్పటికీ ప్రభుత్వాలు పలుమార్లు మైదాన ప్రాంతాలలో జీవనం గడపాలని వీరి సంఘ నాయకులపై పలుమార్లు ఒత్తిడి తెచ్చిన వీరిలో మార్పు లేకపోవడంతో వారు వారికి సంబంధించిన కుటుంబ సభ్యులు వారికి కావలసిన పోడు చేసుకోవడానికి అనుకూల ప్రాంతమైనటువంటి వాగులు సాగు చేసుకోవడానికి భూమి కలిగిన ప్రాంతాలలో కుటీరాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు ఏదైనా ప్రమాదం సంభవిస్తే వీరు మైదాన ప్రాంతాలకు రావాలని ఉంటే రోడ్లు సౌకర్యం లేక కరెంటు సౌకర్యం లేక ప్రాణాల పోయిన సందర్భాలు ములుగు జిల్లాలు చాలా ఉన్నాయి నానా ఇబ్బందులు పడవలసిన పరిస్థితి కనబడుతుంది వర్షాకాలం సీజన్లో విష జ్వరాలతో గర్భిణీ స్త్రీలు చికిత్స కోసం కొన్ని మైళ్ళ దూరం నడవవలసిన నడిచే పరిస్థితి కనబడుతుంది ముఖ్యంగా ప్రభుత్వాలు పలుమార్లు వారికి సూచనలు చేసిన వారిలో మార్పు లేకపోవడంతో ఆ సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు

ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు సంబంధిత మండలాధికారుల పై జిల్లా అధికారులపై ఒత్తిడి పడడంతో ఏం చేయలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారు.

శుక్రవారం

ఏటూరునాగారం మండలం గుర్రాలాబావికి చెందిన గోత్తి కోయ గిరిజన యువకుడు మడకం అయితయ్య 18 సంవత్సరాల గత నాలుగు రోజుల నుండి జ్వరం రావడంతో దగ్గరలోని ఆర్ ఎం పి దగ్గర చికిత్స తీసుకున్నాడు.

అప్పటికి నయం కాకపోవడంతో రక్త కణాలు తగ్గి అపార్మరక స్థితిలోకి వెళ్ళిపోయాడు.

గమనించిన బంధువులు ఏటూరునాగారం అంబులెన్స్ కి సమాచారం ఇవ్వగా విషయం తెలుసుకున్న ఈ ఏం టి శివలింగంప్రసాద్, పైలట్ కోటి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని వేళ్ళి చూడగా బాధితులను తీసుకురావడానికి కనీసం రోడ్డు మార్గం లేకుండా బురద రోడ్డు ఉండడంతో, అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి ఎలాగైనా ప్రాణాలు నిలిపాలని ఎదురుగా వెళ్ళి డోలీ సహాయంతో బాధితున్ని అంబులెన్స్ వరకు భుజాన మోసుకొచ్చారు.

అనంతరం బాధితుని పరీక్షించగా అపస్మారక స్థితిలో ఉన్న యువకునికి బాడీలో చక్కెర స్థాయి పడిపోయి,

తీవ్ర జ్వరం ఉండడాన్ని గమనించి ఈ ఆర్పిపి డాక్టర్ మౌనిక సూచన,సలహాల మేరకు కావలసిన సూదులు,మందులు,గ్లూకోజు బాటిల్ ఇచ్చి హుటాహుటిన మెరుగైన వైద్య సేవల కి ఏటూరునాగారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కి తరలించి పూర్తి వివరణను వైద్యులకు వివరించగా బాధితునికి వైద్యులు పరీక్షించే రక్త పరీక్షలు చేసి చికిత్స అందజేస్తున్నారుఇంతటి గొప్ప మానవత్వాన్ని చాటుకున్న అంబులెన్స్ వారికి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు

## జవహర్ నవోదయ విద్యాలయం--

## 2027 ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి.

**జూలై 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలి.**

**:: జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జులై 17** ములుగు ఈ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ జూలై 31, 2026 కాగా, ప్రవేశ పరీక్ష నవంబర్ 28, 2026 శనివారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అర్హతలు 2026--27 విద్యా సంవత్సరంలో ములుగు జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. అభ్యర్థులు 01-05-2015 నుండి 31-07-2017 మధ్య జన్మించి ఉండాలన్నారు. 3వ, 4వ తరగతులను ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పూర్తిచేసి ఉండాలని పేర్కొన్నారు.

జవహర్ నవోదయ విద్యాలయాలు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రతిష్టాత్మక నివాస పాఠశాలలని, 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు పూర్తిగా ఉచిత విద్య అందిస్తాయని తెలిపారు. విద్యార్థులకు వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం తదితర సౌకర్యాలన్నీ ఉచితంగా కల్పించబడతాయని, సీబీఎస్ఈ విధానంలో ఆంగ్ల మాధ్యమం ద్వారా బోధన జరుగుతుందని వివరించారు.

విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక విద్య, పోటీ పరీక్షల దిశగా ప్రత్యేక శిక్షణ అందించబడుతుందని తెలిపారు.



దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహించబడుతుందని, ఎలాంటి దరఖాస్తు రుసుము లేదని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థి ఫోటో, సంతకం, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం, చదువుతున్న పాఠశాల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ పత్రం, వికలాంగుల ధ్రువీకరణ పత్రం,అలాగే అపర్ ఐడి, పెన్ ఐడి వంటి అవసరమైన వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించబడతాయని, అలాగే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, బాలికలు, దివ్యాంగులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు అమలులో ఉంటాయని తెలిపారు.

అర్హులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జూలై 31లోగా అధికారిక వెబ్‌సైట్ https://navodaya.gov.in లేం‘ https:// cbseit ms.rcil .gov.in/nvs ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అర్హులైన ప్రతి విద్యార్థికి ఈ సమాచారాన్ని చేరవేసి, దరఖాస్తు ప్రక్రియలో అవసరమైన సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ అరుదైన అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకుని జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశం పొందేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

### ముత్తూట్ కార్యాయలంలో బాధితుల అందోళన

హైదరాబాద్ కేపి.హెచ్.బి పోలీస్ స్టేషన్ పరిధిలో ముత్తూట్ ఫిన్ కార్ప్ గోల్డ్ లోన్ సంస్థలో మేనేజర్ ప్రియాంక చేసిన మోసంలో తో నేడు బాధితులు మరోసారి కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. తాము గోల్డ్ లోన్ లో పెట్టిన బంగారాన్ని మేనేజర్ ప్రియాంక తన స్వలాభానికి వాడుకొని డబ్బులు తీసుకుందని వెంటనే తమ బంగారాన్ని తమకు అందజేయాలని డిమాండ్ చేశారు. సుమారు 60 మంది బాధితులు తన వలన ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. ఓవైపు పోలీసులు మరోవైపు బ్రాంచ్ సిబ్బంది ఎటువంటి సమాధానం చెప్పడం లేదని తాము వాపోయారు. అదే విధంగా స్వర్ణ వర్షం అనే స్కీం ద్వారా కూడా మోసాలు జరిగాయని అన్నారు దానిపైన కూడా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## సైబర్ నేరాలపై ప్రజలను నిత్యం అప్రమత్తం చెయ్యాలి

**సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**సుజాతనగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు.**

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై17 ప్రజాబలం:**వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సుజాతనగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ముందుగా కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ పుష్పగుచ్ఛం అందించి జిల్లా ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది నుంచి జిల్లా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు.

పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనాల సంరక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల షెడ్‌ను జిల్లా ఎస్పీ ప్రారంభించారు.





అనంతరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, అధికారులకు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని ఎస్పీ సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల నమోదు, దర్యాప్తు సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా అప్‌డేట్ చేయాలని, సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య అందుబాటులో ఉన్న సాంకేతిక సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

పోలీస్ స్టేషన్‌లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ తెలిపారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. డయల్--100కు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి వేగంగా చేరుకుని బాధితులకు అండగా నిలవాలని తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీతో పాటు అధికారులు పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.

ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, సీఐ ఆర్. వెంకటేశ్వర్లు, ఎస్సై రమాదేవి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# భూగర్భ జలాలు పెంచాలి నీటిని వృధా చేయకండి

## ప్రతి నీటి బొట్టు విలువైనది

## మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై17 ప్రజాబలం:**వైరా మున్సిపాలిటీ పరిధిలో 1వ వార్డు, బి.సి. కాలనీ లో "జల్ సంచయ్ జన్ భాగిధారి" (జే.ఎస్.జే.బి)




3.0 కార్యక్రమంనిర్వహించారు. జల్ సంచయ్ జన్ భాగిధారి (జే.ఎస్.జే.బి) 3.0 కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలిఅని మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్ర కళ పేర్కొన్నారు .వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరికీ శుక్రవారం కార్యక్రమంలో భాగంగా వారు పాల్గొని మాట్లాడుతూ, భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జల్ సంచయ్ జన్ భాగిధారి (జే.ఎస్.జే.బి) 3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతిపౌరుడు తనవంతు బాధ్యతగా పాల్గొనవలసిందిగా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ తెలిపారు ఈసందర్భంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, వ్యాపారసంస్థలు, స్వచ్ఛందసంస్థలు మరియు యువత అందరూ ఈకార్యక్రమంలో చురుకుగా పాల్గొని వర్షపు నీటిసంరక్షణ చర్యలను చేపట్టాలని, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని,నీటివృథానునివారించాలని,భూగర్భజలాలనుపెంపొందించాలని, చెరువులు పరిరక్షించాలని, ప్రతిఇంటిలో వర్షపునీటిసంరక్షణవ్యవస్థలనుఏర్పాటుచేసుకోవాలని విజ్ఞప్తి చేసారు.ప్రతి ఇంటివద్ద వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుటకు, భవిష్యత్ తరాలకు తగిన నీటి భద్రత కల్పించుటకు మరియు పర్యావరణ పరిరక్షణకు మనమందరం తోడ్పడవచ్చు.నీటిప్రతిబొట్టుఅమూల్యమైనది. భవిష్యత్తరాలకు నీటిభద్రతను కల్పించాలంటే ప్రతిపౌరుడు బాధ్యతతో వ్యవహరించి నీటిసంరక్షణలో భాగస్వామి కావాలి. ప్రజల సహకారంతోఈకార్యక్రమంవిజయవంతమవుతుందని, అందరూ స్వచ్ఛందంగా పాల్గొని "జల్ సంచయ్ జన్ భాగిధారి" కార్యక్రమాన్ని విజయవంతంచేయాలనివిజ్ఞప్తిచేయడమైనది.ఈప్రజాఉద్యమాన్నివిజయవంతంచేయడానికివైరామున్సిపాలిటీతో కలిసి ప్రతిపౌరుడు స్వచ్ఛందంగా పాల్గొని నీటిసంరక్షణకుకట్టుబడిముందుకురావలసిందిగామున్సిపల్కమీషనర్ విజ్ఞప్తిచేస్తున్నారు.నీటిని ఆదా చేద్దాం -- భావితరాలకుభద్రతకల్పిద్దాం."మున్సిపల్ కమీషనర్ మరియు మున్సిపల్ఛైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒకటో వార్డు కౌన్సిలర్ మోర్ శ్రీకాంత్ మున్సిపల్ మేనేజర్ సుధీర్ వార్డు ప్రజలు మరియు మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# మసూద్ మృతి పార్టీకి తీరని లోటు

## ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ఆవేదన

## కొత్తగూడెంలో పలు కుటుంబాలకు పరామర్శ

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై17 ప్రజాబలం:**మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకులు మసూద్ మరణం



పార్టీకి, మైనారిటీ వర్గాలకు తీరని లోటు అని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. ఇటీవల ఎస్ కే. మసూద్ గుండె పోటుతో మరణించారు. ఈ రోజు వారి స్వగృహానికి వెళ్ళి మసూద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మసూద్ సతీమణి 54వ డివిజన్ కార్పొరేటర్ నళినీ జయంతి మసూద్ మరియు కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మసూద్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ మసూద్ మరణం పార్టీకి, మైనారిటీ వర్గాలకు తీరని లోటు అని, మసూద్ దంపతులు ప్రజలకు చేసిన సేవలు మరువలేవని, మైనారిటీ వర్గాల కబరస్థాన్ స్థలం కోసం పోరాడిన వ్యక్తి అని కొనియాడారు.

లి అనంతరం అనారోగ్యానికి గురైన కాంగ్రెస్ నాయకులు సురేష్ ను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రామవరంలో కరెంట్ షాక్ తో మరణించిన కాంగ్రెస్ యువ నాయకులు కళ్యాణ్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. బాబు క్యాంప్ నకు చెందిన అడేపు విజయ లక్ష్మీ కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకుల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవి ప్రసన్న, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత, రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి, కొత్వాల శ్రీనివాస రావు, మాజీ జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్ర శేఖర్ రావు, జిల్లా అధికార ప్రతినిధి వై. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ జానీ పాషా, మంద హనుమంత రావు, కొదుమూరి శ్రీనివాస్ రావు, జిల్లా జనరల్ సెక్రటరీ లు పెద్ద బాబు, నాగార్జున, సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, ఐఎన్ టీఎంసీ నేత రజాక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, పట్టణ, మండల కాగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ యాదవ్, దేవగడ్ల ప్రసాద్, జేమ్స్ సునీల్, భువన సుందర్ రెడ్డి, చింతలపూడి రాజ శేఖర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గద్దల రమేష్, కార్పొరేటర్లు, సర్పంచ్ లు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో ఏ6 నిందితుడు కానిస్టేబుల్ వెంకటేష్ అరెస్ట్.



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై17 ప్రజాబలం:**కొత్తగూడెం 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగిక దాడికి సంబంధించిన కేసులో ఏ-6 నిందితుడు, బెటాలియన్ కానిస్టేబుల్ వెంకటేష్‌ను కొత్తగూడెం 2 టౌన్ పోలీసులు అరెస్ట్ చేసిన కేసు వివరాలను కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వెల్లడించారు. కేసు వివరాల ప్రకారం.. నిందితుడు మైనర్ బాలికను కొత్తగూడెం పాత డిపో ప్రాంతంలోని ఒక గదికి తీసుకెళ్లిన సమయంలో, ఆ గదిలో నిందితులకు ఆశ్రయం కల్పించిన ఏ-6 బెటాలియన్ కానిస్టేబుల్ వెంకటేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

ఈ ఘటనకు సంబంధించి బాధితురాలి తల్లి 11.07.2026న కొత్తగూడెం 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ఏ-6 నిందితుడు వెంకటేష్‌ను కొత్తగూడెం 2 టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు.

# పాడి పశువుల కొనుగోలు పూర్తి పారదర్శకంగా నిబంధనల మేరకు నిర్వహించాలి.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

## జాబితా ఖరారైన వెంటనే రుణాలు మంజూరు చేసి, లబ్ధిదారుల ఆమోదంతో పాడి పశువులు కొనుగోలు చేయాలి

## ఇందిరా మహిళా డెయిరీ పథకంలో పరిపాలనా వ్యయాలను నియంత్రించాలి

## పాడి పశువుల కొనుగోలుకు ఎస్ఓపీ ఖరారు చేసి ప్రతి మండలంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై17 ప్రజాబలం:** ఇందిరా మహిళా డెయిరీ పథకం అమలులో పరిపాలనా వ్యయాలను నియంత్రిస్తూ, నాణ్యత, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.



శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరా మహిళా డెయిరీ పథకం అమలుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ లబ్ధిదారుల జాబితా ఖరారైన వెంటనే సంబంధిత కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. రుణాలు మంజూరైన వెంటనే ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు పాడి పశువుల కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని సూచించారు.



పాడి పశువుల కొనుగోలు ప్రక్రియలో లబ్ధిదారుల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని, లబ్ధిదారులు పరిశీలించి ఆమోదించిన పశువులనే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. కొనుగోలు బృందంలో లబ్ధిదారులతో పాటు అనుభవజ్ఞులైన పశువైద్యులు, సంబంధిత అధికారులు మాత్రమే పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ప్రతి వారం 25 మంది లబ్ధిదారులకు మొత్తం 50 పాడి పశువులను కొనుగోలు చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని, అదే సమయంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు.

పరిపాలనా వ్యయాలను నియంత్రించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్న కలెక్టర్, సాధారణ పశువుల కొనుగోళ్లకు అమలు చేస్తున్న పరిపాలనా వ్యయ విధానాన్నే ఇందిరా మహిళా డెయిరీ పథకం పశువుల కొనుగోలులోనూ అనుసరించాలని, పరిపాలనా వ్యయాలకు ఒక ప్రామాణిక విధానాన్ని రూపొందించి నిర్ణీత పరిమితికి మించి ఖర్చు చేయరాదని స్పష్టం చేశారు.

లబ్ధిదారులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమాల్లోనే పాడి పశువుల కొనుగోలు తేదీలు, కొనుగోలు విధానం, లబ్ధిదారుల బాధ్యతలు, అనుసరించాల్సిన నిబంధన లపై సమగ్ర అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

పాడి పశువుల కొనుగోలు ప్రక్రియను పూర్తిగా నిబంధనల మేరకు నిర్వహించేందుకు ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ)ని తక్షణమే ఖరారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలంలో పాడి పశువుల కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటీ కొనుగోలు ప్రక్రియలో నాణ్యత, పారదర్శకత, ప్రభుత్వ మార్గదర్శకాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.

ఈ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్డిఓ శ్రీరామ్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.డి. ముజాహిద్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.పురంధర్, ఎంపీడీవోలు, ఏపీఎంలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఎంపీ వద్దిరాజు యువతకు పిలుపు

కాంగ్రెస్ సర్కార్ అవలంభిస్తున్న విద్యార్థి,యువజన వ్యతిరేక విధానాలను నిరసిస్తూ హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో శనివారం (18వతేదీ)జరిగే "యువ సంగ్రామ సదస్సు"కు పెద్ద సంఖ్యలో తరలి రావలసిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు.ప్రతి నిత్యం అన్ని వర్గాల ప్రజల న్యాయమైన హక్కుల సాధనకు పోరాడుతున్న ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఆధ్వర్యాన జరుప తలపెట్టిన ఈ సదస్సును అడ్డుకోవడం ద్వారా నిరుద్యోగ యువత గొంతు నొక్కుదామని ప్రయత్నించిన రేవంత్ రెడ్డి కుట్ర విఫలమయ్యిందన్నారు.

సదస్సును అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేసినా గౌరవ హైకోర్టు ప్రజాస్వామ్య హక్కులను కాపాడుతూ అనుమతివ్వడం సంతోషకరమని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.అధికార పార్టీ, ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా విద్యార్థులు,యువత తరఫున బీఆర్ఎస్ పోరు సల్పుతూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలు, కుట్రలు , కుతంత్రాలను ఎండగడుతూ జరిగే ఈ సదస్సుకు ఉదయం 10గంటల కల్లా పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాల్సిందిగా విద్యార్థులు,యువతకు ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com